# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 50 సంచిక : 02 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మాఘ-ఫాల్గుణ మాసములు ఫిబ్రవరి : 2026



# VIDYA BHARATI VIGNANA KENDRA


(A CBSE School run by Sri Saraswati Vidya Peetham)

Nadergul, Badangpet Municipality - 501510



*Empowering Minds, Nurturing Hearts*

## HOSTEL FACILITY AVAILABLE FOR BOYS FROM GRADE - IV ONWARDS






## PANCHAKOSHIYA VIKAS


















# ADMISSIONS OPEN FOR AY 2026 - 2027

## SCHOOL FEATURES:

- *13 Acres of pristine playgrounds with a 400m track*
- *Ancient Wisdom blended with modern outlook*
- *Hands - On Learning with advanced Science, Computer & Math Labs*
- *Vedic Math & Sadacharam*
- *Well stacked Library*
- *State of the Art & Hygienic Kitchen & Dining hall*


Email: - vbvk.svp@gmail.com

Contact: 90636 66304, 90003 55433

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5127, శాలివాహన శక సం. 1947, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మాఘ-ఫాల్గుణ మాసములు

సంపుటి : 50, సంచిక : 02, ఫిబ్రవరి 2026, పుటలు : 36, వెల : రూ.18/-



సంపాదకులు

**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**

ప్రచురణ కర్త

**పసర్తి మల్లయ్య**

**సంపాదకమండలి**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

గోపగోని సప్తగిరి

అన్నావర్ఝుల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,

హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004



**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

యం.ఓ./ డి.డి. ద్వారా

శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున

క్రింది చిరునామాకు పంపగలరు.



**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**

ఇ.నెం. 6-3-597/ఎ/7,

వేంకటరమణ కాలనీ,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.

ఫోన్ : 040-23316160, 23316084

**e - mail :sphoortissvp@gmail.com**


## అమృతవాణి

శ్లో॥ మృత్యు: సర్వహరాశ్చాహం, ఉద్భవశ్చ భవిష్యతాం ।
కీర్తి: శ్రీర్వాక్చ నారీణాం, స్మృతిర్మేధా ధృతి: క్షమా ॥

**భావము :** అన్ని ప్రాణుల ప్రాణములను హరించు మృత్యువును నేనే. సర్వ ప్రాణుల పుట్టుకకు హేతువును కూడ నేనే. స్త్రీలలో కీర్తి, శ్రీ, వాక్కు స్మృతి, మేధ, ధృతి, క్షమా అను గుణములను కూడ నేనే అని గీతాచార్యుడు చెప్పెను.

## ఈ సంచికలో . . .


| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| దేశ-ధర్మ రక్షణలో సమ్మక్క-సారలమ్మలు | ... 05 |
| బుద్ధిమంతులు కావాలంటె !? | ... 09 |
| శివతత్త్వము - పంచారామ క్షేత్రాలు | ... 11 |
| కుజ గ్రహం | ... 15 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 207 | ... 22 |
| ఈ వయస్సులో ... నాకేమి తెలుసు. | ... 23 |
| పునాది అక్షరాస్యత | ... 25 |
| భారీ స్థాయిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు | .. 27 |
| ఏది సత్యం? ఏది అసత్యం? | ... 29 |
| సైనిక్ స్కూల్ | ... 31 |
| వార్తలు | ... 33 |



Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**

# ప్రాథమిక విద్య నిర్లక్ష్యం కాకూడదు

**నే**డు మన దేశంలో వివిధ రంగాలలో ముందంజలో ఉంది. విద్యారంగంలో కూడ చెప్పుకోదగిన రీతిలోనే ఉంది. అయినా అది గుర్తించలేని కొందరు విదేశాలకు వెడుతున్నారు. అది వేరే విషయం. తప్పు కాదు. అయితే ఉన్నత విద్య గురించి, ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం.ల గురించే ఎక్కువగా చర్చలు, ఆలోచనలు జరుగుతూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు గాని వీటన్నిటికి పునాదిగా ఉండే ప్రాథమిక విద్యను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారనిపిస్తోంది. కొన్ని అధ్యయనాలను పరిశీలించిన తరువాత, దేశ భవిష్యత్తు విశ్వ విద్యాలయంలో కాక ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందన్న సత్యాన్ని మనం మరచిపోతున్నాం. భారత మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాం భారతదేశపు యువతలో ప్రపంచ స్థాయి విద్య మరియు నైపుణ్యాలు అందాలి కాని ఆ లక్ష్యానికి మొట్టమొదటి అడుగు ప్రాథమిక విద్య అని ప్రాథమిక విద్యయొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. దీనిని గుర్తించిన నేటి కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం 2020లో ప్రాథమిక విద్యకు పెద్దపీట వేసింది. విద్యార్థుల వికాసానికి గ్రహణశక్తి, బుద్ధి సూక్ష్మత పెరగడానికి మాతృభాషలో విద్యాబోధన కానసాగాలంటూ సూచనలిస్తూ పాఠ్య ప్రణాళికను కూడ తయారుచేసింది. ఈ వాస్తవాన్ని విద్యారంగంలోని ప్రముఖులందరూ గుర్తించి అమలు పరిచే దిశలో ఆలోచనలు చేయాలి.

అయితే ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల వికాస గ్రహణ శక్తులకు తగిన ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆధారాలు కనిపించడం లేదు. ఇటీవల కొన్ని సంస్థలు సర్వే నిర్వహించి సమర్పించిన నివేదికలను బట్టి చూస్తే చేదు నిజాలు బయట పడ్డాయి. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి రెండవ తరగతి వాచక పుస్తకాన్ని కూడ గడగడ చదవలేక పోతున్నాడు. రాతల్లో కూడ ఒత్తులు, అక్షర దోషాలు లేకుండా రాయలేక పోతున్నాడు. గణితంలో కూడా తగిన నైపుణ్యాలుండటం లేదని తెలుస్తోంది. అందుకే జాతీయ విద్యావిధానం ఒక నూతన దృక్పథాన్ని ప్రతిపాదించింది. అర్థం చేసుకోవడం, ఆలోచించడం, అన్వయించగలిగే లక్షణాన్ని కలిగించేదే నిజమైన చదువు, విద్య, అని చెప్పింది. దీనికి మాతృభాషే ప్రధాన సాధనమని కూడ అనుభవజ్ఞులైన విద్యావేత్తలు సూచించారు. 2వ తరగతి వరకు ఆటలు, పాటలు, కథలే వీరి పాఠ్యాంశాలు కావాలి. గురువులు కావాలి. ఆ తరువాత తరగతుల్లో మాత్రమే పుస్తకం, పెన్సిలు పట్టాలని బాలబాలికలపై ఒత్తిడి లేకుండా నైపుణ్యాలను పెంపొందించే దిశగా పాఠశాలల్లో విద్యా బోధన ఆచరణాత్మకం కావాలి. అయితే దీని అర్థం చదవడం, వ్రాయడం ఉండకూడదని కాదు, పై విషయాలను విద్యకు పునాదిగా వేయడండా భావించాలి. విద్యార్థుల సామర్థ్యాన్ని చూసి అవసరానికనుగుణంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలి. **"అంటే అత్యున్నత అభ్యాస రూపం"** అన్న ఐన్‌స్టీన్ మాటలను ఆచరణలో పెట్టే విధంగా ప్రాథమిక పాఠశాలలు ఉండాలి.

కళాత్మక విషయాలు, అంటే సంగీతం, నాట్యం, నాటకం, యోగ, క్రీడలు, పర్యావరణ పరిశీలనాంశాలు పాఠ్యప్రణాళిక కాదని భావించకూడదు. అదే అసలు సిసలైన వ్యక్తిత్వ వికాస పాఠాలు. మానవతా విలువల రూపాలు. వీటి ద్వారానే పిల్లలలో సృజనాత్మకత, మానవత, సహకారత, నేతృత్వము, ధీరత, నిపుణత వంటి గుణాలు అలవడతాయి. అంర్నిహితంగా ఉన్న గుణాలు వికసిస్తాయి. దీనికనుగుణంగానే నూతన జాతీయ విద్యావిధానం ఉంది. ఎన్ని విధానాలు ప్రవేశ పెట్టినా, పాఠ్యప్రణాళిక రూపొందించినా తరగతిలో అమలు చేసే వ్యక్తి ఉపాధ్యాయుడే. అందుకే నేటి ఉపాధ్యాయుడు బోధకుడుగా మాత్రమే కాక మార్గదర్శిగా ఉండాలి. దానికోసం ఉపాధ్యాయుడు కూడ తన సామర్థ్యాన్ని నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ ఉండాలి. బోధించిన విషయాలను బాలబాలికలు ఎంత వరకు అర్థం చేసుకుంటున్నారో మూల్యాంకనం చేసుకుంటూ ముందుకు వెడితే ప్రాథమిక విద్యలో మంచి పునాది పడే అవకాసముంటుంది. ★

ముఖ చిత్రకథనం


## దేశ-ధర్మ రక్షణలో

# సమ్మక్క-సారలమ్మలు



ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

హిందూ ధర్మంలో మాత్రారాధన అనాదికాలం నుండి ఉంది. ఆత్మారాధనం, భూతారాధనం (పంచ భూతాలు), జంత్వారాధనం (మత్స్య-కూర్మ-వరాహ), ప్రజ్ఞానవ దేవతారాధనం, మాత్రారాధనం ... ఈ వరుసలో ఆరాధనా విధానాలు స్థిరపడ్డాయి. చివరికి దేవారాధనం పేర ఏది-ఎవరు (వస్తువు, ప్రకృతి, జంతువు, స్త్రీ, పురుషుడు) అనే తేడా లేకుండా దివ్యత్వం ఉన్న ప్రతీదీ దైవంగానే భావించే స్థితి యేర్పడింది.



ఇందులోని మాత్రారాధనంలో భాగంగానే సమ్మక్క-సారలమ్మల పూజలు ప్రారంభమయ్యాయి. కేవలం తెలుగు రాష్ట్రాలలోనే దాదాపు వంద వరకు గ్రామ దేవతలున్నారు. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ, బాలమ్మ, కోట మైసమ్మ, కట్ట మైసమ్మ, నల్లపోచమ్మ, పెద్దమ్మ, గంగమ్మ, తలుపులమ్మ, మారెమ్మ, చౌడమ్మ, పైడితల్లి .... ఇలా వందలాది మంది అమ్మవార్లు దేవతలుగా కొలువబడుతున్నారు.

అలాగే గిరిజన దేవతలుగా సమ్మక్క-సారలమ్మలు పూజలందుకొంటున్నారు. కేవలం గిరిజనులే కాక ఆయమ్మ వార్లను అందరూ తమ దేవతలుగానే భావిస్తున్నారు. అర్చిస్తున్నారు; నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారు.

మాఘ పౌర్ణమి నాడు ప్రతి రెండేళ్లకోసారి సమ్మక్క-సారలమ్మల జాతరలు (ఉత్సవాలు) జరుగుతాయి. తెలంగాణ గిరిజన కుంభమేళాగా, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర భారతదేశంలో తలమానికంగా నిలిచించి. తెలంగాణ నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్ రాష్ట్రాలనుండి లక్షలాదిమంది ప్రజలు ఈ గిరిజన జాతర ఉత్సవాలకు తరలి వస్తారు.

వరంగల్ నుండి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడ్వాయి మండలంలోని అటవీ ప్రాంతమే మేడారం. తాడ్వాయి నుండి 15 కిలోమీటర్ల దూరం ఉంటుంది మేడారం. హైదరాబాద్ నుండి 270 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

తల్లీబిడ్డలైన ఈ యిద్దరు మాతృమూర్తులు దేవతలుగా ఆరాధింపబడడానికి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. చెబుతున్న కథలకు ఎక్కడా శాసనస్థ ఆధారాలు లేవు.

**విదేశీయుల దాడుల్లో మన ఆలయాల దుస్థితి :-**

భారతదేశం మీద అలెగ్జాండర్‌తో పాటు ఎందరో దాడులు చేసి, విధ్వంసం చేసి, అందినంత దోచుకొని వెళ్లారు. గజనీలు, ఘోరీలు ఆ విధంగానే వచ్చి దోపిడీలతో పాటు మారణహోమం సృష్టించారు. 712 ప్రాంతంలో మహమ్మద్ బిన్ ఖాసీం సింధ్ ప్రాంతంపై దాడిచేశాడు. వేలాదిమంది హిందువులను చంపేశాడు. రాజాదాహిర్‌సింను మోసంతో సంహరించాడు. ఏడువందలమంది దేవదాసీలను బానిసలుగా చేసుకొన్నాడు. మహిళలు, పిల్లలు, యువకులు, వృద్ధులు అన్న తేడా లేకుండా పైశాచికంగా అమానవీయంగా వ్యవహరించాడు; భారతాన్ని ఇస్లామీకరణ చేసి మత రాజ్యం స్థాపించడానికి పునాదులు వేశాడు. ఇక్కడి నుండే ముస్లింల పాలన ప్రారంభమై దేశమంతా ఆక్రమణకు గురైంది.

అలా దేశంలో ఈ పరిపాలన విస్తరిస్తూ వచ్చింది. ఇది దక్షిణ భారతాన్ని తాకింది. అప్పుడు కాకతీయుల పరిపాలనలో ఈ మేడారం ప్రాంతముంది.

**కాకతీయుల పాలనలో తెలుగు నేల:-**

చరిత్రకారుల కథనం ప్రకారంగా కాకతీయులు

1000వ సంవత్సరం నుండి 1323వ సం॥వరకు పరిపాలన చేశారు. వరుసగా మొదటి బేతరాజు, ప్రోలరాజు, రెండవ బేతరాజు, రుద్రదేవ రాజు, గణపతి దేవ చక్రవర్తి, రుద్రమదేవి, ప్రతాపరుద్రదేవుడనబడే రెండవ ప్రతాపరుద్రుడు, ఈ రెండవ ప్రతాపరుద్రుడు 1296 నుండి 1323 వరకు పరిపాలించాడు.

కాకతీయులు గుడులు కట్టించారు; చెరువులు నిర్మాణం చేశారు. హనుమకొండలోని ఆలయ శిల్పాలు, భద్రకాళి చెరువు ఈ నాటికీ సాక్ష్యాలుగా ఉన్నాయి. ప్రజానురంజక పరిపాలకులుగా ఉన్నవారిపై ఢిల్లీ సుల్తానులు దండయాత్ర చేశారు. 1320లో ఘియాసుద్దీన్ తుగ్లక్ ఢిల్లీలో చక్రవర్తి అయ్యాడు. తన కుమారుడు ఉలుగ్‌ఖాన్‌ను సైన్యంతో ఓరుగల్లుపైకి పంపించాడు. కాకతీయ సైన్యం బాగానే పోరాడింది. కాని సైన్యం ఓడిపోయింది. ఇదంతా 1328లో జరిగింది. కాకతీయ ప్రతాపరుద్రుడు తురుష్కుల చేతికి చిక్కాడు. అతణ్ణి బంధించి సైన్యం ఢిల్లీకి తీసుకొని పోయింది.

**ప్రభువు రక్షణలో గిరిజన సామంతులు :-**

కాకతీయుల కెందరో సామంతులున్నారు. అందులో కోయదొర మేడరాజు ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని పొలవాస ప్రాంతానికి అధిపతి. అతని మేనల్లుడు అంటే చెల్లెలి కొడుకు పగిడిద్దరాజు మేడారం ప్రాంతానికి రాజు.

ఈ యిరువురు కాకతీయులకు సామంతులే. అడవులు కొండలు కోనలున్న ప్రాంతాన్ని అలనాడు అంటే రామాయణ కాలంలో గుహుడు పాలించినట్లుగా, ద్వాపర యుగం భారతకాలంలో భగదత్తుడు పరిపాలించినట్లుగా, రాజ్యాల సరిహద్దులలో రక్షకులుగా గిరిజనులు ఉండే సంప్రదాయం శాస్త్ర బద్ధమైంది. చాణక్యుని అర్థ శాస్త్రంలోనూ, నాటి రాజ్యాంగంలో కనిపించే గ్రంథాల్లోనూ ఈ విషయం స్పష్టంగా ఉంది.

వాళ్ళకు పంట పండి గిరి ప్రజలు సుభిక్షంగా ఉన్నప్పుడు మాత్రమే పన్నులు చెల్లిస్తారు. కరవు కాటకాలు వచ్చినప్పుడు రాజ్యాన్ని పాలించే ప్రభువులే వారికి అన్ని విధాలా ఆహారధాన్యాదుల్ని, వస్త్రాలు, గృహావసరాలకు సంబంధించిన వస్తువులు పంపిస్తుంటారు. కాకతీయ రాజులు గిరిజనుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేశారు. రాజ్యరక్షణలో వారి పాత్రని గుర్తించి పారితోషికాలిచ్చారు; సన్మానాలు చేసి సనదులు ప్రకటించారు. మేడరాజు, పగిడిద్దరాజు పూర్వీకులకు ఈ సన్మాన సత్కారాలు సందర్భాన్ని బట్టి అందాయి.

అలాంటి తమ ప్రభువు ప్రతాపరుద్రుణ్ణి బంధించి తీసుకొని పోవడాన్ని గిరిజనులందరూ వ్యతిరేకించారు. అందుకే వారిని అడ్డగించి పోరాడారు.

**వన దేవతలైన గిరిజన బిడ్డలు :-**

మేడరాజు కోయదొర. ఆయన వనంలోని పంట క్షేత్రాల నుండి పులిని తరుముకొంటూ ఒక రోజు వెళ్ళాడు. పులి పారిపోయింది. రాజు అతని అనుచరుడు ఓరావిచెట్టు క్రింద విశ్రాంతి తీసుకొంటున్నారు. అప్పుడే అక్కడి పొదల్లో ఓ పసిపాప ఏడుపు వినిపించింది. మేడరాజు, అతని అనుచరుడు రాచరాజు ఇద్దరూ ఆత్రంగా ఆ పూల పొదదగ్గరికి వెళ్ళారు. అక్కడ వారికి చిన్న బాలిక దర్శనమిచ్చింది. ఆ పాప పూలపొత్తిళ్ళలో ఉంది. చంద్రరేఖలా మిలమిల మెరుస్తున్న పాపను పిల్లలు లేని మేడరాజు మహదానందంతో హృదయానికి హత్తుకొన్నాడు.

ప్రభూ! జనకరాజుకు భూపుత్రిలా మీకు భూమిబిడ్డ దొరికింది అన్నాడు రాచరాజు. కాదు కాదు ఈ పాప భూలచ్చిమే; నేను సమ్మక్క అని పిలుచుకొంటాను; పెంచి పెద్ద చేస్తాను; ఈ వనానికే దేవతను చేస్తాను అన్నాడు మేడరాజు.

ప్రభూ! నిజంగా ఈ పాప దేవతే అన్నాడు రాచరాజు సంతోషంతో మేడరాజు పొవలాసకు వెళ్ళాడు. తన బిడ్డగా పెంచాడు; పెద్ద చేశాడు; యుక్త వయస్సులో తన మేనల్లుడు మేడారం రాజుగా ఉన్న పగిడిద్ద రాజుకు ఇచ్చి గిరిజనులందరి కోలాహలంతో కూడుకొన్న మహదానందంలో మునిగి తేలుతూ పెళ్ళి జరిపించాడు. మేడారం రాజైన పగిడిద్ద రాజు కుటుంబం వికసించింది.

మేడారం రాజు పగిడిద్దరాజు సమ్మక్కల పెద్ద

కూతురు సారలమ్మ; తల్లితో సమానంగా ఎదిగింది. రెండో కూతురు నాగులమ్మ, కొడుకు జంపన్న, పడిగిద్దరాజు తమ్ముడు గోవింద రాజు. అందరూ వనదేవతలనారాధిస్తూ, గిరిజనుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ జీవిస్తున్నారు. వారు వనంలోని అందరితో కలిసిపోయారు. వనజీవులైన పశుపక్ష్యాదులు కూడా వారికనుసన్నులలోకి వచ్చినై. సమ్మక్క గిరిజనులందరికీ ప్రేమ పాత్రురాలయింది. వన జీవులైన అనేక జంతువులు వారికి దగ్గరయ్యాయి. అవీ పగిడిద్ద రాజు-సమ్మక్కల కుటుంబంలో భాగమైనట్లుగా మెలుగుతున్నాయి.

ఈ పరిస్థితులలోనే ముస్లింల దండయాత్రలు మొదలయ్యాయి. ప్రతాపరుద్రుడు ఉలుగ్‌ఖాన్‌కు బందీకాకముందే 1309లో మాలిక్ కాఫిర్ ఛత్తీస్‌గఢ్ పై దండయాత్ర చేశాడు. అతనికి 1296-1316 మధ్యలో ఢిల్లీ పరిపాలకునిగా ఉన్న అల్లాఉద్దీన్ ఖిల్జీ అండదండ లున్నాయి. ఖిల్జీ ప్రోత్సాహంతో ఇతను లక్షలాదిమంది హిందువులను భయపెట్టి, హింసించి ఇస్లాంలోకి మార్చాడు.

ఇంత క్రూరాతి క్రూరులైన ముస్లింలు తమ ప్రభువును బంధించి తీసుకొని పోవడం తమ శక్తిహీనతగా గిరిజన ప్రభువులు భావించారు. అందరూ సామూహికంగా పోరాటంలో పాల్గొన్నారు.

శ్రీ సమ్మక్క పగిడిద్ద రాజుల ఏకైక పుత్రిక సారలమ్మ, మేడరాజు చెల్లెలు సత్య మందాల దేవి; ఆమె భర్త చలాసంధుడు. ఆ దంపతుల కొడుకులే పగిడిద్ద రాజు, గోవిందరాజు, పెద్ద ముల్లాదుడు, చిన్న ముల్లాదుడు నలుగురు పుత్రులు. అందరు సమ్మక్కను దేవతగా భావిస్తున్నారు.

కొంతమంది గిరిజనులు పగిడిద్దరాజు భీముని అంశతో, సమ్మక్క ద్రౌపది అంశతో జన్మించారని చెబుతున్నారు. సమ్మక్క ఆదిశక్తి స్వరూపిణి అని బెల్లంతో గాని, బలితోగాని నైవేద్యం పెట్టే సంప్రదాయం ఆ తర్వాత యేర్పడింది.

అయితే క్రూరాతిక్రూరులు, తమ మతమే ప్రపంచంలో ఉండాలనుకొన్న తుగ్లక్ పంపిన ఉలుగ్‌ఖాన్ సైన్యం గిరిజనులనెందరనో సంహరించింది.

పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, మేడరాజు, గోవిందరాజు తదితరులందరూ పోరాడుతూనే మరణించారు. జంపన్న మాత్రం తప్పించుకొన్నాడు.

దేవతగా ఆవిర్భవించిన సమ్మక్క మాత్రం యుద్ధంలో పోరాడుతూనే కనిపించకుండా అదృశ్యమై పోయింది. ఆ తల్లికి-ఆ వనదేవతకు అర్థమైంది. చిలకల గుట్ట వైపుగా వెళ్ళిన సమ్మక్క దేవతకై గిరిపుత్రులందరూ దు:ఖభారంతో అన్వేషించారు. చిలకల గుట్టవైపు వెళ్ళిన, ఆ దేవత అదృశ్యమైన చోట వారికి కుంకుమ భరణి కనిపించింది. ఆ భరణికే నాటి నుండి నేటి వరకు పూజపునస్కారాలు జరుగుతున్నాయి.

ఇంతకూ తప్పించుకొన్న జంపన్న తన అక్కలు సారలమ్మ, నాగులమ్మలు పోరాటంలో మరణించడంతో కలత చెందాడు. పైగా దేవత అయిన తల్లి కనిపించకుండా పోయింది. తరువాత మేడరాజు సంగతి తెలియదు. మానసికంగా దిగాలు పడిపోయిన జంపన్న సంపంగి వాగులో ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆ వాగుకు జంపన్న వాగనే పేరువచ్చింది.

**పూజలు-పునస్కారాలు :-**

ముస్లిం మత సామ్రాజ్య వాద దురహంకారం కారణంగా, కాకతీయ రాజ్యం పతనమైంది. ఆ రాజ్యానికి బాసటగా నిలిచిన గిరిజన రాజ్యం కుప్పకూలిపోయింది. ఆ గిరిజనుల బిడ్డలు వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ, పగిడిద్ద రాజు, జంపన్నలు మాఘశుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజులు అర్చింపబడుతున్నారు. బంగారం సమర్పించిన వారికి కోరిన కోరికలు నెరవేరుతున్నాయి.

కాకతీయ రాజులు పోయినా, వారి పాలనలోని ప్రజానీకం గిరిజనులతో పాటు అందరూ ఈ వనదేవతలను పూజిస్తున్నారు. తమ అభీష్టం నెరవేర్చుకొంటున్నారు. ఈ వనదేవతలు ప్రస్తుత భారతాన్ని, సనాతన హైందవ ధర్మాన్ని రక్షించి వికసింప జేయాలని తద్వారా ప్రపంచశాంతి జరగాలని అందరూ మొక్కుకొంటున్నారు. ★

# నిజమైన క్రమశిక్షణ అంటే? అది ఎంతో సులభం

– D. కరుణాకర్, ప్రధానాచార్యులు, VBVK (CBSE), నాదర్‌గుల్

'క్రమశిక్షణ', ఈ పదం ఇళ్లల్లో, పాఠశాలల్లో ఎక్కువగా వినిపిస్తుంది. పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలని తల్లిదండ్రులు అనుకుంటారు. అలాగే, పాఠశాల కూడా తమ పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టాలని తల్లిదండ్రులు ఆశిస్తూ ఉంటారు. ఉపాధ్యాయులైతే రోజు ఈ పదాన్ని కనీసం నాలుగుగైదు సార్లయినా అంటూ ఉంటారు లేదా వింటూ ఉంటారు.

క్రమశిక్షణను ఆంగ్లంలో మనం 'Discipline' అని అంటామని అందరికి తెలిసిందే. ఈ ఆంగ్ల పదం యొక్క అర్థం చూస్తే మనకు 'Control gained by enforcing obedience' లేదా 'behaviour in accordance with rules' అని కనపడుతుంది. ఈ రెండు అర్థాలు పూర్తిగా సరైనవి కావు, పాక్షికంగా మాత్రమే కరెక్టు. చాలా మంది తల్లిదండ్రులే కావచ్చు ఆచార్యులే కావచ్చు ఈ అర్థాలే సరైనవని భావిస్తుంటారు. ఇంకో విషయం. 'క్రమశిక్షణ' ఈ పదం వింటేనే ఏదో భయం, నిర్దయ, టెన్షన్ తెచ్చేది లాగా అనిపిస్తుంది. మరీ ముఖ్యంగా దాన్ని ఆంగ్లంలో విన్నప్పుడు 'Discipline' అని.

చాలా మంది క్రమశిక్షణ అంటే బయటకు కనిపించే ప్రవర్తనే అని అనుకుంటూ ఉంటారు. ఇలా నిలబడాలి. అలా మూతిమీద వేలు వేసుకుని అల్లరి చెయ్యకుండా కూర్చోవాలి. చేతులు వెనకి కట్టుకొని మాట్లాడాలి లేదా ముందుకు కట్టుకొని మాట్లాడాలి. చెయ్యి ముందుకు చాచి (ఇది మరీ విడ్డూరం) లోపలికి రావచ్చా అని అడగాలి, పెద్దవారిని ప్రశ్నలడగ వద్దనడం, ఇవి కాదు క్రమశిక్షణ అంటే. మరచిపోయాను, క్లాస్ మొత్తం సైలెంట్ గా ఉంటే కూడా క్రమశిక్షణకు సంకేతం కాదు. కానీ చాలా అల్లరిగా ఉంటే మాత్రము తప్పకుండ క్రమశిక్షణ లేనట్టే. టీచరంటే వణికి పోవడం, భయపెట్టడం, అస్సలు క్రమశిక్షణ కాదు. టీచరంటే గౌరవం ఉండాలి భయం కాదు. పిల్లలను కొట్టడం, అవమానించడం, దుర్భాషలాడటం, వారిని ఇతరులతో పోల్చి బాధ పెట్టడంతో మనం క్రమశిక్షణ తేలేము. అలా క్రమశిక్షణ రాదు సరికదా పిల్లవాడు చదువుకు మరియు క్రమశిక్షణకు పనికిరాకుండా అయిపోతాడు. అసలు ఈ పైవన్నీ పాఠశాలల్లో చేస్తున్న అర్థం లేని పైకి కనిపించే స్వల్పకాలిక చర్యలు. వీటితో పైపైన మాత్రమే ఏదో ఒక ఆర్డర్ (స్థితి) కనపడుతుంది కానీ పిల్లల్లో క్రమశిక్షణ రాదు. ఎందుకంటే ఇవేవి క్రమశిక్షణకు సంబందించినవి కానే కాదు.

మరి క్రమశిక్షణ లేదా డిసిప్లిన్ అంటే ఏమిటి? అలోచించి చూస్తే, "డిసిప్లిన్ లేదా క్రమశిక్షణ అంటే సరైన పనిని సరైన సమయంలో సరైన విధంగా చేయడమే". "Doing the right thing at the right time in a right way is discipline.' ఇది అందరికీ వర్తిస్తుంది. పిల్లలకు మరియు ఆచార్యులకూ, అలాగే ఆడ, మగ తేడా లేకుండా ఎవరికైనా వర్తిస్తుంది. ముఖ్యంగా మనం పిల్లలకు క్రమశిక్షణలో పెట్టాలంటే వారిని ఏ పనైనా చేసేటప్పుడు ఆ పని ఈ మూడు ప్రశ్నలకు సానుకూల సమాధానం ఇస్తుందా లేదా ప్రతికూల సమాధానం ఇస్తుందా గమనించమనాలి. సానుకూల సమాధానం ఇచ్చే ఏ పనైనా క్రమశిక్షణ క్రిందికే వస్తుంది. ప్రతికూల సమాధానం ఇస్తే అది క్రమశిక్షణ క్రిందికి రాదు. ఆ మూడు ప్రశ్నలు పైన చెప్పిన విధంగానే:

1. ఇది సరైన పనియేనా ?
2. ఇది సరైన సమయమేనా అనుకున్న పని చేయడానికి?
3. ఇది సరైన పద్ధతేనా అనుకున్న పని చేయడానికి?

(తరువాయి భాగం 10వ పుటలో...)

పద్య-పరమార్థం

# బుద్ధిమంతులు కావాలంటే !?



ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

**"తె**లుగు భాష రావాలంటే, తెలుగు సంస్కృతి లేదా భారతీయ సంస్కృతి తెలవాలంటే, నైతిక విలువలు, మానవతా మూల్యాలు, సామాజిక సాంస్కృతికాంశాలు నాటుకోవాలంటే పదవ తరగతి వరకే కనీసం వంద పద్యాలన్నా నోటికి రావాల్సిందే!

చదువుకొంటున్న బాలబాలికల గురించి, వారి ఎదుగుదల గురించి విశ్లేషిస్తూ వెనకటికి ఇలా ఓ పంతులుగారు చెబుతుండే వారు. ఊరకే చెప్పడం కాదు, పనిగట్టుకొని ప్రచారం చేస్తుండే వారు.

ఆయన ఉద్దేశం ప్రకారంగా కృష్ణశతకంలోని ఓ పది, సుమతి శతకంలోని ఓ ఇరవై, వేమన శతకంలోని ఓ ముప్పయి, కుమారీ-కుమార శతకంలోని ఓ పది, దాశరథి శతకంలోని ఓ పది, ధర్మపురి నరసింహ శతకంలోని ఓ పది, సుభాషితాలోక పది... ఇలా ఓ వంద పద్యాలు ధారణ చేయాలనేవారు వారు.

ఎందుకు! అంటే ప్రారంభంలో చెప్పుకొన్నామే నీతి-రీతి తెలియాలని! ఎలాగో ఒకటి రెండు సుమతీ పద్యాల ద్వారా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం!

**కం॥ "వినదగునెవ్వరు చెప్పిన**
**విన్నంతనె వేగపడక వివరింపదగున్**
**కనికల్ల నిజము దెలిసిన**
**మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!"**

ఎవరు ఏమి చెప్పినా వినాలి; విన్నవెంటనే తొందర పడి అదీ ఇదీ అనరాదు. ఆలోచించుకొని మంచీ-చెడు వివరించాలి. అసత్యమా-సత్యమా అని ఆలోచించి నిజం తెలుసుకొని మాటాడాలి. ఈ మహిలో అంటే ఈ భూమిలో ఈ మన మధ్యలో అని అర్థం. అటువంటి వాడే నీతిపరుడని మనుష్యత్వం ఉన్న మనిషి అని గ్రహించాలి.

ఇలాంటి శతక పద్యాలే మన పెద్దలు నేర్చుకోవాలని చెప్పారు. ఒక సారి ఆలోచించండి! ఎంత బాగుంది ఈ పద్యం. చెప్పింది జాగ్రత్తగా వినాలి. అర్థం చేసుకోవాలి. మంచి మనసులో దాచుకోవాలి. మాటిమాటికి మననం చేసుకోవాలి. అది మనం ఆచరించాలి. ఆ మంచిని పదిమందికి చెప్పాలి. మన జీవితంలోకి వచ్చిన వెలుగు వారి జీవితాల్లోకి వస్తుంది. అలా లోకంలో (మహిలో) మంచితనమే పెరుగుతుంది.

కల్ల (అసత్యం) నిజము (సత్యం) తెలుసుకొని మాటాడ్డం వల్ల అందరూ సత్యసంధులవుతారు. సత్యం వద .... అని మన వేదాంత గ్రంథాలు చెబుతున్నాయి. ఆలోచించేవారికి సత్యహరిశ్చంద్రుని కథ గుర్తుకు వస్తుంది. సాధుస్సత్యపరాక్రమ: .... అని కీర్తించబడ్డ శ్రీరామచంద్రుని జీవనయానం గుర్తుకు వస్తుంది. సంస్కృత స్కాందపురాణంలోని సత్యం పలికిన గోవు కథ తెలుసుకోగలుగుతాం. ఆడకుమసత్యభాషలంటూ...... అదే గోవు కథను అనంతామాత్యుడు తన కావ్యంలో తెలుగులలో చెప్పిన కథ గురించి తెలుసుకోగలుగుతాం. సత్యమే ఈశ్వరుడన్న రామాయణంలోని మారీచుని కథా సందర్భం అవగాహన చేసుకోగలుగుతాం.

అలనాటి పరిపాలకుడు బద్దెన (కవిరాజు) వ్రాసిన చిన్న పద్యం ఎన్ని ఆలోచనలకు మూలమయ్యిందో చూడండి! ఆయన శతకంలోనిదే! మరొక పద్యం కూడా చూద్దాం!

**కం॥ "తనకోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష, దయచుట్టంబౌ!**
**తన సంతోషమె స్వర్గము**
**తన దు:ఖమెనరకమండ్రు తథ్యము సుమతీ!"**

కోపము మనిషితో పాపం చేయిస్తుంది అంటుంది ఒక సంస్కృత సూక్తి, తన కోపమే శత్రువవుతుంది. తనశాంతమె తనకు రక్షగా ఉంటుంది. తనదయా హృదయమె తనకు బంధువు అవుతుంది. తన సంతోషమే తనకు స్వర్గమవుతుంది.

తీరా చూస్తే తన దు:ఖమే తనకు నరకమవుతుందని శతక కర్త ఇది నిజం .... నిజం అంటున్నారు.

క్రోధం అనేది ఎంత అనర్ధదాయకమో శ్రీమద్భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పారు. (శ్లో।। క్రోధాద్భవతి సమ్మోహ:, 2-63)

**కం।। "క్రోధమున అవివేకిగానగు**
**అవివేకమున మరపు పుట్టును**
**మరపువల్లనె బుద్ధినాశము**
**బుద్ధినాశమె సర్వనాశము"**

అరిషడ్వర్గాల్లో కోపం ఒకటి. మనిషి పతనానికి దారి తీసేది యేదైనా అనర్ధదాయకమే. అందుకే కోపం వచ్చినప్పుడు తనను తాను తమాయించుకోవాలి. కోపానికి కారణమైనదేదో అది మరచిపోవడానికి ప్రయత్నం చేయాలి.

ముఖం కడుక్కోవాలి; మంచినీళ్ళు తాగాలి; అటునిటు తిరగాలి; పత్రిక చదవాలి; ఏవైనా జ్ఞాపకాలు దినచర్యలో వ్రాసుకోవాలి; ఎవరైనా మాటాడుతున్న మంచి మాటల్ని వినాలి. అలా మెల్లగా కోపం తగ్గిపోతుంది.

కోపంతో పని మాత్రం చేయకూడదు; ఎందుకంటే ఆ పనికి సంబంధించిన వస్తువులేవైన మన చేతిలో ఉంటే వాటిని విసరి కొడతాం. అందువల్ల చాలా నష్టాలు వస్తాయి. అందుకే కోపం లేకుండా ఉండాలి; జ్ఞాని కావాలి; బుద్ధిమంతులై మంచి పనులను చేయాలి.

శతక పద్యాలు మనుషుల్ని బుద్ధిమంతులను చేస్తాయనే ఉద్దేశంతోనే పదవ తరగతి వరకు పిల్లలందరూ మంచి మంచి పద్యాలు నేర్చుకోవాలన్న మాట. ప్రయత్నం చేద్దాం మరి!! ★

(8వ పుట తరువాయి భాగం ...)

దయచేసి గమనించాలి ఈ మూడు ప్రశ్నలలో ఏ ఒక్క ప్రశ్నకు సమాధానం ప్రతికూలమైనా ఆ చర్య, ఆ పని క్రమశిక్షణ క్రిందికి రాదు. అంటే మనం చేసే ప్రతి పని ఈ మూడింటిని ఒకేసారి తప్పనిసరిగా సంతృప్తి పరచవలసిందే. ★

## ప్రతిభా విద్యార్థుల వర్గ శ్రీశారదాధామం

ప్రతి యేడాది లాగే ఈ సంవత్సరం కూడా ఉత్తమ ప్రతిభా విద్యార్థుల వర్గ శ్రీశారదాధామం కేంద్రంగా జరిగింది. జనవరి 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఈ వర్గ కొనసాగింది. ఈ వర్గలో తెలంగాణ ప్రాంతంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరందరికీ ప్రతిరోజూ ఆయా విషయ నిపుణులు మార్గదర్శనం చేశారు.

విద్యార్థులు పరీక్షల భయాన్ని ఎలా ఎదుర్కోవాలి? ఆయా పరీక్షల్లో నిపుణతను సాధించడం ఎలా? పరీక్షలను ఎలా రాయాలి? అత్యధిక మార్కులు సాధించడం ఎలా? ఓ సబ్జెక్టును ఎలా చదవాలి? ఎలా అర్థం చేసుకోవాలి? అన్న అంశాలతో మిగతా విషయాలపై కూడా విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. అలాగే ఈ రోజుల్లో ప్రతి సబ్జెక్టుపై 'క్విజ్' నిర్వహణ, పరీక్షల నిర్వహణ కూడా చేశారు. అయితే క్విజ్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది.

ఉద్ఘాటన కార్యక్రమం రోజున విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షులు ఆచార్య తిరుపతి రావు గారు, ప్రాంత కార్యదర్శి శ్రీమతి అనఘా వేంకట లక్ష్మి గారు, ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు గారు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. అకాడమిక్ లో ఎలా విజయం సాధించాలి? లక్ష్యం ఎలా నిర్ణయించుకోవాలి? దానిని ఎలా చేరుకోవాలి? అన్న విషయాలపై మార్గదర్శనం చేశారు.

సమారోప్ కార్యక్రమానికి ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు గారు మార్గదర్శనం చేశారు. కేవలం లక్ష్యం పెట్టుకుంటే సరిపోదని, దానిని సాధించాలని, అందుకు తగ్గ కృషి కూడా చేయాలని సూచించారు. లక్ష్య సాధనలో ఎక్కడా నిరాశ చెందవద్దని, పూర్తి విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఇందుకోసం విజయం సాధించిన వారి గాథలను కూడా అభ్యాసం చేయాలని సూచించారు. ప్రతి సబ్జెక్ట్ పై పట్టు సాధించాలని, దీని ద్వారా

(తరువాయి భాగం 16వ పుటలో...)

# శివతత్త్వము - పంచారామ క్షేత్రాలు





- డా॥ అన్నదానం వేం.సుబ్రహ్మణ్యం

మాఘ బహుళ చతుర్దశి అర్ధరాత్రి సమయంలో లింగోద్భవం జరిగింది. అదే మహాశివరాత్రి. ప్రతి మాసము శివరాత్రి వచ్చినా మహాశివరాత్రి సంవత్సరంలో ఒక్కసారే వస్తుంది. ఆనాడు శివునకు విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయి. తరువాత నాలుగో జామున పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం జరుగుతుంది. శివరాత్రిలో శివం అంటే మంగళము అని అర్థం. శివుడు అంటే మంగళకరుడు. పార్వతీ దేవికి సర్వ మంగళ అని పేరు. అర్ధనారీశ్వర తత్వమంతా మంగళ ప్రదమే. "రాత్రి" అనే శబ్దానికి ఒక ప్రత్యేకార్థ ముంది. ఋగ్వేదంలో "రాత్రి సూక్తం" ఒకటుంది. దాంట్లో రాత్రిని ప్రశంసిస్తూ యూపమంత్రాలు కొన్ని ఉన్నాయి. అందుకేనేమో రాత్రిపూట కూడ సుముహూర్తాలు పెడుతుంటారు. లింగోద్భవ కాలం కూడ అప్పుడే. మహాశివరాత్రి పూజలు రాత్రి పూటే జరుపుకోవాలి.

మహాశివరాత్రి నాటి శివారాధనలో మూడు విశిష్టతలు ఉన్నాయి. అవి 1.ఉపవాసము, 2.జాగరణ, 3.శివపూజ. నాకు ఉపవాసము చేసే భక్తులంటే అత్యంత ప్రీతికరము అని పరమేశ్వరుడే అన్నట్లు శాస్త్రాలు చెప్తున్నాయి, అయితే ఉపవాసమంటే ఏమిటి? ఉప అంటే సమీపము. వాసము అంటే నివసించుట, ఉండుట అని అర్థాలు. అనగా ఇష్టదైవము దగ్గరగా ఉండటమే ఉపవాసమని భావం.

**ఉపావృత్తస్య పాపేభ్యో**
**యస్సు వాసో గుణై స్సహ**
**ఉపవాసః సవిజ్ఞేయః**
**సర్వభోగ వివర్జయేత్** ॥ అని భవిష్య పురాణంలో చెప్పబడింది. అంటే ఆ రోజున అన్నపానాదులతో సహా సర్వభోగములను విడిచి పెట్టి భగవంతుని గుణగానం చేస్తూ కాలం గడపడమే విధి అని చెప్తోంది. అయితే ఇందులో తెలిసైనా తెలియకైనా అన్నపానాదులు లేకుండా భగవన్నామ కీర్తనలు, స్తోత్రాలు వింటూ ఆ పరిసరములలో కాలంగడిపినా దాని ఫలితం దక్కుతుందని అర్థం. అగరుబత్తి వెలిగించిన వాడు ఒక్కడైనా, కడ్డీ పుల్ల ఒక్కటైన ఆ పొగ వ్యాపించినంత మేరా సువాసన వ్యాపించినట్లే యీ పవిత్ర ప్రాంగణంలో ఉంటే పవిత్రతను సంతరించుకొని తగిన ఫలితాన్ని పొందుతారు. గుణనిధి వృత్తాంతమే దీనికి తార్కాణం.

గుణనిధి శివరాత్రి రోజున దేవాలయంలోనే రోజంతా కాలం వెళ్లబుచ్చి గర్భగుడిలో దీపారాధన చేసి ప్రసాద భక్షణం చేసినందువల్ల మోక్షం లభించింది. ఈశావాస్య మిదం సర్వం. ఈ సర్వమూ ఈశ్వర మయము. సమస్త ప్రాణులను నిగ్రహించ గలిగిన మహా పురుషుడు సర్వకాల సర్వావస్థలందు అంటే రాత్రి పూట కూడ జాగృతుడై ఉంటాడు. విషయాసక్తుడు నిద్రాధీనుడై ఉంటే నిగ్రహశక్తుడు మెలకువతోనే ఉంటాడు. కాబట్టి శివరాత్రి రోజున శివనామ స్మరణతో జాగరణ చేయడం ముఖ్యమైనది.

అలాగే శివారాధన కూడ ప్రాముఖ్యతను సంతరించుకున్నది. శివుడు జలధార ప్రియుడు. అందుకే

**శివుని శిరమున కాసిన్ని నీళ్లు జల్లి**
**పత్తిరిసుమంతనెవ్వాడు పారవైచు**
**కామధేను వతడింట గాడి పసర**
**మల్ల సురశాఖి వానింట మల్లె చెట్టు.**

అని శ్రీనాథ మహాకవి వర్ణించాడు. శివుని శిరస్సుమీద కాసిని నీళ్లు చల్లి, మారేడు పత్రిని పెడితే చాలు పరమశివుడు తృప్తి పడి ఆ భక్తునింట కామధేనువు గాటకట్టిన పశువుగాను, కల్పతరువు మల్లెచెట్టుగాను నిలిచేలా చేస్తాడట. అందుకే ఆయనను ఆశుతోషుడు అన్నారు. అంటే అల్ప సంతోషి అని. బోళాశంకరుడు అని కూడ అన్నారు. మారేడు పత్రి, సువర్ణముఖీ జలాలు శివలింగముపై పోసి భక్త కన్నప్ప మోక్షమును పొందిన కథ జగద్విదితమే.

పరమశివుడు సర్వాంతర్యామి. పరిపూర్ణుడు. సర్వవ్యాపకత్వానికి ఒక రూపమంటూ ఉండదు. కాని యే

రూపంలో కావాలంటే ఆ రూపంలో దర్శన మిస్తాడు. అర్ధనారీశ్వర తత్త్వంలో సాంబమూర్తిగా దర్శనమిస్తాడు. అయితే నిరాకారమైన పరిపూర్ణతాస్థితికి సాంబ శివ రూపానికి మధ్య మరో రూపముంది. అదే శివ తత్త్వ స్వరూపం. లింగరూపం. ఆది మధ్యాంతములు లేనిది. మహాశివరాత్రి పర్వదినాన జ్యోతిర్లింగ స్వరూపుడుగా అవతరించిన ఆ పరమశివుడు దేశంలో ద్వాదశ జ్యోతిర్లింగ స్వరూపాలలోను, పంచ మహాభూతాలకు ప్రతిరూపంగా, పంచ మహాభూత లింగముల రూపంలోను పంచారామాలలో అమృతలింగ రూపంలో భక్తులకు తననారాధించుకునేలా దర్శనమిస్తుంటాడు. కొన్నిచోట్ల స్వయంభువుగా, మరికొన్ని చోట్ల ప్రతిష్ఠిత దైవంగా పూజలు పొందుతుంటాడు. పరమశివుడు భక్త సులభుడు. బోళాశంకరుడు. లోకముల పాలిట కరుణా హృదయుడు. అందుకే లోకరక్షణ కోసం గరళాన్ని మింగి గళాన ధరించాడు. ఆయన శిరస్సుపైనున్న నెలవంకే ఆయన అమృతత్వము. వేలాడుతున్న జటలన్నీ విద్యలకు సంకేతము. ఆయన ఢమరుక శబ్దం నుండే అక్షరాలు ఉత్పన్నమయ్యాయి. వాటినే మహేశ్వర సూత్రములని అంటారు. అందుకే ఆయన మహాజ్ఞాన జ్యోతి స్వరూపుడు. శిరస్సుపై గంగానది రూపంలో జలాన్ని, లలాటమునందున్న నేత్రంలో అగ్నిని ధరించిన విశ్వరూపుడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతము సమస్త ప్రాణులను అనుగ్రహించే దైవము పరమ శివుడు. శివారాధాన చేసిన సాలెపురుగు, సర్పము, ఏనుగు వంటి ప్రాణులను అనుగ్రహించి మోక్ష ప్రదానం చేశాడు. అదే శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంగా విరాజిల్లు తోంది.

ఇక తెలుగునాట ఉన్న శైవక్షేత్రాలలో చెప్పుకోదగినవి పురాణ ప్రసిద్ధి చెందినవి పంచారామాలు. ఈ అయిదు పుణ్యక్షేత్రాలకు ఒక విశిష్టత ఉంది. దేవదానవులు క్షీరసాగరాన్ని మధించేటప్పుడు కల్పవృక్షం, కామధేనువు, చింతామణి మొదలైన వాటితోపాటు అమృత స్ఫటిక మహాలింగం కూడ ఆవిర్భవించింది. పరమశివుని భక్తుడైన తారకాసురుడు దానిని అపహరించి కంఠాభరణంగా ధరించి మహాశక్తి సంపన్నుడైనాడు. అదే అతనికి రక్షణ కవచమైంది. ఆ తరువాత కుమారస్వామితో జరిగిన యుద్ధంలో యెన్ని దివ్యాస్త్రాలు ప్రయోగించినా తారకాసురుడు చావడం లేదు. అప్పుడు నారదుడు తారకాసురుని మెడలోని అమృత లింగాన్ని ఖండించినప్పుడే అతడు మరణిస్తాడని ఆ అమృత లింగపు ఖండాలు భూమిమీద పడిన వెంటనే వాటిని ప్రతిష్ఠించాలి. లేకపోతే అవి వేగంగా పెరుగుతూ ఆకాశాన్ని తాకగలుగుతాయని, గ్రహగమనానికి, కాలగమనానికి అవాంతరమేర్పడుతుందని చెప్పాడు. వెంటనే కుమారస్వామి నారాయణాస్త్రాన్ని ప్రయోగించి ఖండించగా అవి ఓంకార నాదం చేస్తూ తెలుగునాట అయిదుస్థలాల్లో పడ్డాయి. అవే పంచారామాలు. వెంటనే వాటిని ఇంద్రుడు, సూర్య చంద్రులు, విష్ణువు, కుమారస్వామి యీ అయిదుగురు అవి పడిన స్థలాల్లోనే వాటిని ఆశ్వయుజ శుద్ధ దశమి అనగా విజయ దశమి నాడు ప్రతిష్ఠించి పంచామృతాలతో అభిషేకించి పూజలు సల్పారు. అప్పటి నుండి అవి శైవ పంచారామ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. అప్పటికే ఆ లింగాలు ఎత్తు పెరిగాయి. అందుకే అక్కడ ఎత్తైన శివలింగాలు మనకు దర్శనమిస్తాయి. వాటినే దాక్షారామం, అమరారామం, క్షీరారామం, సోమారామం, కుమారారామం అని పిలుస్తారు. వీటిలో దాక్షారామం, కుమారారామాలు తూర్పుగోదావరి జిల్లాలో, క్షీరారామ, సోమారామాలు పశ్చిమగోదావరి జిల్లాలో, అమరా రామము గుంటూరు జిల్లాలోను ఉన్నాయి.

పంచారామాలలో మొదటిది దాక్షారామము. ద్రాక్షారామం అని కూడ అంటుంటారు. ఇది సూర్య



ప్రతిష్ఠితము. ఇక్కడి స్వామి వారిని భీమేశ్వరుడు అని పిలుస్తారు.

ఈ లింగం సుమారు 90 అడుగుల ఎత్తు ఉంటుంది. అందుకే పై అంతస్థులో నిలబడి అభిషేకాలు, పూజలు చేస్తుంటారు. ఈ లింగం సగం నలుపు, సగం తెలుపులో ఉండటం విశేషం. ఇక్కడి అమ్మవారికి మాణిక్యాంబాదేవిగా పూజలు చేస్తుంటారు. అష్టాదశ శక్తి పీఠాలలో ఇదొక పీఠం. దక్షుడు యజ్ఞం చేసినది ఇక్కడే అని కాబట్టే దాక్షా రామం అని భక్తుల విశ్వాసం. దీనికే దక్షిణ కాశి అని పేరు.



గుంటూరు జిల్లా కృష్ణానదీ తీరాన ఉన్న రెండవ క్షేత్రం అమరావతి. అమరేశ్వర స్వామిగా దర్శన మిస్తుంటాడు. ఇక్కడి శివలింగం 9 అడుగుల ఎత్తు. ఇది ఇంద్ర ప్రతిష్ఠితము. అందుకే అమరేశ్వరుడైనాడు. ఆ పట్టణానికి అమరావతి అని పేరు.

పాలకొల్లులో ఉన్నది క్షీరారామము. ఇది విష్ణు ప్రతిష్ఠితము. క్షీరారామ లింగేశ్వరుడుగా పూజలు



పొందుతుంటాడు. ఈ లింగం ప్రతిష్ఠించిన ప్రదేశం నుండి పాలధార వచ్చిందట. అందుకే ఆ స్వామికి ఆ పేరు వచ్చిందని విశ్వాసం. 135 అడుగుల ఎత్తులో నాలుగువైపుల ఎత్తైన గోపురాలుండటం ఈ దేవాలయ ప్రత్యేకత.

దీనికి సమీపంలోనే భీమవరంలో చంద్ర ప్రతిష్ఠితమైన సోమేశ్వరాలయం ఉంది. అయితే ఇక్కడి శివలింగానికొక విశిష్ఠత ఉంది. శుక్ల పక్షంలో తెలుపు



రంగులో ఉండే శివలింగం కృష్ణ పక్షంలో క్రమంగా అమావాస్య నాటికి గోధుమ రంగులోకి మారుతుంటుందట. పూర్ణిమ-అమావాస్య రోజులలో యీ స్పష్టత కనిపిస్తుంది. నిజ రూపం తెలియాలంటే మూడు సమయాలలో దర్శనం చేసుకోవాలి. భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు చేస్తుంటారు.

అయిదవది సామర్లకోటలోని కుమారారామం. దీనిని కుమారస్వామి ప్రతిష్ఠించాడు. ఇక్కడ శివలింగం సుమారు 12 అడుగుల ఎత్తు ఉంటుంది. సామర్లకోటకే



చాళుక్య భీమవరం అనికూడ మరో పేరు. చాళుక్య భీముడనే రాజు దీనిని రాజధానిగా చేసుకొని పరిపాలించడం వలన ఆ పేరు వచ్చిందని చారిత్రక కథనం. ★

# “నేను శిశు మందిర్ విద్యార్థి అని కాలర్ ఎగరేసుకొని చెబుతా”

శ్రీ బండి సంజయ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి



కరినగర్ ఉన్నత పాఠశాలలో విభాగ్ స్థాయి ఖేల్ ఖూద్ పోటీలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు ప్రారంభించారు. అఖండ జ్యోతిని వెలిగించి ఈ పోటీలకు జెండా ఊపారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి పూలమాలను అర్పించి, అఖండ జ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభించారు. పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ గారు ఖేల్ ఖూద్ ప్రకటన చేశారు. సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ గారు అతిథి పరిచయం, శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్ గారు కార్యక్రమ ప్రస్తావన చేశారు. సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి గారు మాట్లాడుతూ ఆటలు మానవ జీవితంలో నాయకత్వ లక్షణాలను పెంపొందిచడానికి, ధైర్యాన్నందించడానికి, మానసిక ఉల్లాసం కల్పించడానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. మరో వైపు వివిధ పాఠశాలల నుంచి 611 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

ఇక ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గారు మాట్లాడుతూ విద్యార్థులు చాలా అదృష్టవంతులని, శిశుమందిర్ లో విద్యనభ్యసించడం చాలా గొప్పతనంగా భావించాలని, మీరంతా దేశ సేవ చేయడానికి సైనికులుగా ముందుకెళ్లాలని సూచించారు. విద్యతో సంపాదన రావచ్చు కానీ, విద్యతో సంస్కారం రాకపోతే ఆ సంపాదన కుటుంబానికి, సమాజానికి భారమేనన్నారు. ఇది గమనించే సరస్వతీ శిశుమందిర్ పిల్లలను ఉద్యోగార్థులుగా కాదు, దేశ సేవకులుగా తయారు చేస్తుందని అన్నారు. ఇక్కడి విద్యార్థి తన గురించి మాత్రమే కాదు, సమాజం గురించి ఆలోచిస్తాడని అన్నారు. ఇదే నిజమైన విద్య అని పేర్కొన్నారు. శిశు




మందిరాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నేర్పిస్తారని వారు అన్నారు. అలాగే “ఈ శిశుమందిర్ లోనే సంస్కారం, సభ్యత నేర్చుకున్నా. నేను శిశు మందిర్ విద్యార్థి అని కాలర్ ఎగరేసి చెబుతున్నా. సభ్యత, విద్య, సమాజం అంటే ఏమిటి? ధర్మం ఏమిటి? ధర్మాన్ని ఎలా రక్షించాలి? సమాజాన్ని సంఘటితం ఎలా చేయాలి? అన్నది నేర్చుకున్నా. అందరికీ శుభాకాంక్షలు”. తెలిపారు. ★



బజర్‌హత్నూర్ – సప్తశక్తి సంగం

★

విజ్ఞానం

# కుజ గ్రహం

## (అంగారకుడు)

✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి



**శ్లో॥ ధరణీగర్భ సంభూతం విద్యుత్కాంతి సమప్రభమ్ ।**
**కుమారం శక్తిహస్తం తం మంగళం ప్రణమామ్యహం ॥**

(అర్థం: భూమి గర్భంలో జన్మించి, మెరుపు వంటి కాంతితో ప్రకాశించే, శక్తిని చేతిలో ధరించిన కుమార స్వరూపుడైన అంగారకుడికి నమస్కరిస్తున్నాను.)

చంద్రుడు, నక్షత్రాలు మాత్రమే ప్రకాశించే రాత్రి సమయాన ఆకాశంలో ఒళ్లంతా రక్తం పులుముకున్నట్లు ఎర్రటి వర్ణంలో కనిపించిన ఒక చుక్క. వేల సంవత్సరాలపాటు ప్రజల్లో భయాందోళనలు కలిగించింది. అదే అంగారక గ్రహం. మానవ నాగరికత మొత్తానికి ఈ గ్రహంతో అనుబంధం ఉంది. దీన్ని అనేక జాతులు అశుభ శకునంగా భావించేవి. ఎన్నో ఏళ్లపాటు దీన్ని యుద్ధం ఘర్షణలకు సంకేతంగా భావించేవారు.

అంగారకుడికి భిన్న జాతులు భిన్న పేర్లు పెట్టాయి. అవన్నీ దీని ఎర్రటి వర్ణం లేదా యుద్ధంతో ముడిపడి ఉండటం



గమనార్హం. రోమన్లు వారి యుద్ధదేవత అయిన 'మార్చ్' పేరును దీనికి పెట్టారు. గ్రీకులు కూడా దీన్ని తమ యుద్ధదేవత 'ఏరిస్' గా భావించేవారు. చైనా ఖగోళశాస్త్రవేత్తలు ఈ గ్రహాన్ని 'అగ్ని నక్షత్రం' (ఫైర్ స్టార్) అని పిలిచేవారు. ఈజిప్టు మత గురువులు 'హెర్ డెషర్' (ఎర్రటి వస్తువు) అనేవారు. బాబిలోనియన్లు 'నెర్గల్' (గొప్ప హీరో) అని వ్యవహరించేవారు. నెర్గల్‌ను వారు ఘర్షణలకు రాజుగా పరిగణించేవారు. హీబ్రూలు అంగారకుడిని 'మా ఆడిమ్' అని పిలిచేవారు. ఈ మాటకు సిగ్గరి అని అర్థం. ఎరుపెక్కిన చెక్కిళ్లకు నిదర్శనంగా అలా పేర్కొనేవారు.

పురాతన కాలంలో రోమ్‌లో సైనిక దళాలు యుద్ధాలకు వెళ్లేముందు.. నగర ప్రహరీ గోడలకు వెలుపల, అంగారకుడి పేరిట ఉండే 'క్యాంపస్ మార్షియస్' అనే క్షేత్రాల్లో శిక్షణ పొందేవి. యుద్ధం తర్వాత.. విజయం సాధించిన దళపతులను ఈ ప్రాంగణంలోనే సత్కరించేవారు. ఆధునిక కాలంలోనూ వీడని భయం!

అంగారకపడికి సంబంధించి ఉన్న అనేక భయాలు, సంశయాలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం విస్తరించాక కూడా కొనసాగాయి. 1880లలో టెలిస్కోపులతో ఆ గ్రహాన్ని పరిశీలించినప్పుడు దానిపై విచిత్రమైన చారలు కనిపించాయి. దాంతో వాటిని కాలువలుగా ప్రజలు భ్రమించారు. అక్కడ తెలివైన గ్రహాంతరవాసులు ఉన్నారని, కాలువల ద్వారా వ్యవసాయం చేస్తున్నారని అనుకున్నారు. వారు భూమిపైకి దండెత్తి వస్తారేమోనని ఆందోళన చెందేవారు.

హెచ్.జి.వెల్స్ అనే రచయిత 1898లో 'వార్ ఆఫ్ వరల్డ్స్' అనే నవల రాశారు. అంగారక గ్రహ జీవులు భూమి మీదకు దండెత్తి వస్తాయి. భారీ సంఖ్యలో ప్రజలను చంపేస్తాయన్నది నవల సారాంశం 1938 లో రేడియో నాటకంగానూ వచ్చింది. అప్పట్లో అమెరికన్లలో తీవ్రస్థాయిలో భయాందోళనలను కలిగించింది. ఆరుణ గ్రహ వాసులు భూమిపై దాడి చేస్తారని వారు బలంగా నమ్మారు. అయితే అక్కడ మేధస్సు కలిగిన నాగరికత సంగతి అటుంచితే.. కనీసం సూక్ష్మజీవుల ఉనికి కూడా అక్కడ మనకు



ఇప్పటివరకూ లభించలేదు.

అయినా అంగారకుడి ప్రమాదం ఇంకా మన మదిలోనే ఉంది. అంగారకుడు అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. దాని నేలంతా విషతుల్యమే సూర్యుడి నుంచి వచ్చే రేడియోధార్మికత నేరుగా దాన్ని తాకుతుంది. ఇంత ప్రమాదకరమైనదైనప్పటికీ ఈ గ్రహాన్ని జయించాలన్న పట్టుదల మానవుల్లో అంతకంతకూ పెరుగుతోంది. అక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవాలని ఆశిస్తున్నారు. అక్కడి ప్రతికూల వాతావరణం భయపెడుతోంది. భవిష్యత్‌లో అక్కడ మానవ ఆవాసాలు సాకారమైనా.. ఎంతో గుండె ధైర్యం ఉన్నవారే అక్కడ ఉండగలరని పరిశోధకులు చెబుతున్నారు.

భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్కృతులు మంగళవారాన్ని అంగారకుడి పేరు మీద పెట్టారు. ఐదు వేల ఏళ్ల కిందట బాబిలోనియన్లు.. ఏడు రోజులకు సూర్యుడు, చందమామ, అంగారకుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, శని గ్రహాల పేర్లను పెట్టారు. ఆయా రోజుల్లో ఆయా ఖగోళ వస్తువులు, మనుషులపై ప్రభావం చూపుతాయని వారు నమ్మే వారు అందులో మంగళవారాన్ని అంగారకుడికి కేటాయించారు. ఈ గ్రహానికి ఘర్షణలతో సంబంధం ఉందని భావించి మంగళవారం ప్రత్యేక పూజలు చేసేవారు. ఇంగ్లీష్‌లో మంగళవారాన్ని 'ట్యూజ్‌డే' అంటారు. ఇంగ్లిషు వారి యుద్ధదేవత పేరు ట్యూస్ (Tews).

యాదృచ్ఛికంగా ఇస్రో కూడా.. మంగళవారం రోజునే మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) ను ప్రయోగిస్తుండటం విశేషం.

మార్చి నెల అంగారకుడి పేరిటే వచ్చింది. రోమన్ యుద్ధదేవత పేరు మార్స్ కావడం వల్ల ఈ నెలకు మార్చ్ అని పేరు పెట్టారు. ★

---

(10వ పుట తరువాయి భాగం ...)

పరిపూర్ణత వస్తుందన్నారు. పదో తరగతి రాసే విద్యార్థులందరికీ విద్యాపీఠం శుభాకాంక్షలు తెలిపింది.

ఉత్తమ ప్రతిభా విద్యార్థుల వర్గపై హాజరైన కొంత మంది విద్యార్థులు అభిప్రాయాలిలా వున్నాయి...

విద్యార్థి పేరు : నైతం రితీష,
10వ తరగతి, ఆదిలాబాద్.



మా పాఠశాలలో ఏం చెప్తారో, ఎలా చెప్తారో శ్రీశారదాధామంలో జరిగిన ఉత్తమ ప్రతిభా విద్యార్థుల సమ్మేళనం లో కూడా అదే చెప్తారని అనుకున్నా. కానీ అది పూర్తిగా తప్పని తేలిపోయింది. చదువుతో పాటు అక్కడ చాలానే నేర్చుకున్నా. క్రమశిక్షణ, యోగాతో పాటు సమయ నిర్వహణ కూడా నేర్చుకున్నా. పరీక్షల ముందు ఎలా చదవాలి? ఏం చదవాలి? అలాగే పరీక్ష రాసే ముందు ఎలా ప్రెజెంట్ చేయాలో కూడా నేర్చుకున్నా. నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు గారు, సుధాకర్ గారు, రేణుక మాతాజీ, పద్మజా మాతాజీ చాలా చక్కగా చెప్పారు. అలాగే నా వ్యక్తిగత పనులు చక్కగా చేయడం.. అంటే బట్టలు ఉతుక్కోవడం, పళ్లెం నాది నేనే శుభ్రం చేసుకోవడం, దుస్తులు చక్కగా పెట్టుకోవడం కూడా నేర్చుకున్నా. తెలుగు,హిందీ విషయ నిపుణులు చాలా చక్కగా నేర్పించారు. ఎక్కడా బోర్ కొట్టలేదు. ఉత్తమ ప్రతిభా విద్యార్థుల వర్గకి వెళ్లకుండా వుండివుంటే... జీవితంలో ఏదో కోల్పోయినట్లు ఫీల్ అయ్యేదాన్ని.

**"లక్ష్యంలేని జీవితం, దిక్సూచి లేని ఓడలాంటిది.**
**దృఢమైన సంకల్పంతో మీ మార్గాన్ని నిశ్చయించుకోండి."**
**– స్వామి వివేకానంద**

(తరువాయి భాగం 30వ పుటలో...)

# శ్రీ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకల చిత్రమాలిక




బాదేపల్లి



బాన్సువాడ




కోరుట్ల



నారాయణపేట



పోసానిపేట




రవీంద్రనగర్-నల్గొండ

# శిశుమందిరాలలో సంక్రాంతి సంబరాల చిత్రమాలిక



ఆర్మూర్



బూర్గంపహాడ్



కల్వకుర్తి



కామారెడ్డి



కోటగల్లి



పెద్దపల్లి



నాగర్‌కర్నూల్



సుభద్రానిలయం

# శిశుమందిరాలలో సంక్రాంతి సంబరాల చిత్రమాలిక




శ్రీవిద్యారణ్య ఇంటర్‌నేషనల్ స్కూల్, బండ్లగూడ జాగీర్



వేదనగర్ - గద్వాల



విశ్వరూపనగర్ సేవా బస్తి



అమరాపురం



నింబోలిఅడ్డ



కళ్యాణదుర్గం



శ్రీనివాసనగర్

# శిశుమందిరాలలో సప్తశక్తి సంగం కార్యక్రమాల చిత్రమాలిక



నాగుల్‌పేట - కోరుట్ల



కులబ్‌గూర్ - సంగారెడ్డి



ఓల్డ్ గుంటూర్



రామాలయం-నారాయణఖేడ్



కుబీర్



మాదన్నపేట



పామిడి




రాంపూర్ ఆవాసం

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు




కె.రిషి–4వ తరగతి–తడ్కపల్లి




యం.సమన్వి–3వ తరగతి–శ్రీశారదాధామము



యం.కార్తికేయ–5వ తరగతి–సిద్ధిపేట



ఎ.రిషి–5వ తరగతి–పామిడి



జి.విరాట్ –2వ తరగతి – స్విస్



బి.విఘ్నేష్ –4వ తరగతి–గద్వాల్

జి.కె.

# లోక జ్ఞానము - 207



అయాచితుల లక్ష్మణరావు

## జనవరి 2026, "స్ఫూర్తి" ఆధారంగా

1. ఉత్తరాయణ ప్రారంభముగా ఏ పండుగను నిర్వహిస్తాము?
2. భగవాన్ బిరసాముండా జన్మ తేదీ ఏది?
3. మహిళలతో ఉండే సప్త శక్తుల గురించి భగవద్గీతలోని ఏ అధ్యాయంలో ఉంది ?

### ధర్మం - సంస్కృతి

4. విభీషణుడు ఎవరి సోదరుడు?
5. ద్రౌపది తండ్రి పేరేమి?
6. అన్నపూర్ణాష్టకం ఎవరు వ్రాశారు?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. మానవ శరీరంలోని మొత్తం ఎముకల సంఖ్య ఎంత?
8. శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో తీసిన చిత్రం ఏది?
9. అతిచిన్న ప్రధాన సంఖ్య ఏది?

### సామాజిక శాస్త్రాలు

10. మూడు వైపులానీరు ఉండి, ఒకవైపు భూభాగం ఉంటే దానిని ఏమని పిలుస్తారు?
11. భారత రాజ్యాంగం రాజ్యాంగ సభ ఆమోదం ఎప్పుడు పొందింది ?
12. భారత దేశం మధ్యగా వెళ్లే రేఖాంశం ఏది?

### సమకాలీన అంశాలు

13. ప్రపంచంలోనే అతిపెద్ద డౌటాసెంటరు మన దేశంలో ఏరాష్ట్రంలో నిర్మించనున్నారు ?
14. 2025 ప్రపంచ చదరంగ పోటి భారత్ లో ఎక్కడ జరిగింది?
15. స్వదేశీ పరిజ్ఞానంతో మన దేశం నిర్మించనున్న అంతరిక్ష నౌక పేరేమి?

## లోక జ్ఞానము -206 సమాధానములు

1. బంకించంద్రచటర్జీ
2. భట్టుమూర్తి
3. భ్రమణము, పరిభ్రమణము
4. నెమలి
5. కోదండం
6. శివుడు
7. ఆరు
8. $90^0$ కంటె తక్కువ
9. అలెగ్జాండర్ ఫ్లెమింగ్
10. 1950
11. భారత రాష్ట్రపతి
12. 1935
13. మారియా కోర్నియా మచాడో (వెనిజులా)
14. సప్త శక్తి సంగం
15. వందేమాతర గీతం

## 138 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | ప. | వసంత ఋతువు |
| 2 | త. | హేమంత ఋతువు |
| 3 | క. | వర్ష ఋతువు |
| 4 | ట. | శరత్ ఋతువు |
| 5 | చ. | శిశిర ఋతువు |

## 139- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. పాండురంగ మహత్యము | ( ) | క. కంచెర్ల గోపన్న |
| 2. శ్రీకాళహస్తీశ్వరశతకం | ( ) | చ. కాళిదాసు |
| 3. దాశరథి శతకం | ( ) | ట. దండి |
| 4. మేఘసందేశం | ( ) | త. తెనాలి రామకృష్ణ కవి |
| 5. దశకుమార చరితము | ( ) | ప. ధూర్జటి |

విద్యార్థులు గానీ,

ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.

(లేదా)

sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

పోషకుల పేజి

# ఈ వయస్సులో ....
# నాకేమి తెలుసు.



✍ - లింగం సుధాకర్ రెడ్డి

నేను ప్రాంత ప్రచారక్‌గా ఉన్న (20 సం॥ల క్రితం) సమయంలో ఒక ప్రధానాచార్యుడి ఇంటికి వెళ్ళాను. భార్యాభర్తలిరువురూ మన శిశుమందిరంలో ఆచార్యులు గానే పని చేస్తున్నారు. వారికి 3వ తరగతి చదువుతున్న కుమారుడున్నాడు. నేను వాడిని దగ్గరకు పిలిచి "ఏరా! నిన్ను మీ అమ్మ కొడుతుందా, నాన్న కొడుతారా?" అని ప్రశ్నించాను-"మా అమ్మ" అని సమాధానమిచ్చాడు. మీ అమ్మ నిన్ను ఎందుకు కొడుతుంది? అంటూ మరో ప్రశ్న వేశాను. "తప్పు చేస్తే ఎవరైనా కొడుతారు కదా!" అంటూ (అవతలి వారిని (తల్లిని) దోషిగా చూపకుండా) అంత చిన్న వయస్సులోను వాడు చెప్పిన సమాధానానికి నాకు చాలా ఆనందం కల్గింది. నేను అంతటితో ఆగకుండా మరి "తప్పు ఎందుకు చేస్తావురా!" అంటూ వేసిన ప్రశ్నకు "ఈ వయస్సులో ఏది తప్పో, ఏది ఒప్పో నాకేం తెలుసు?" అని ఎదురు ప్రశ్నతో చెప్పిన సమాధానం అప్పుడే కాదు, ఇప్పటికీ నా మనసులో మెదులుతూనే ఉంటుంది. ఈ ఉదంతాన్ని అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్ని సందర్భాల్లో చెప్పానో!.

మళ్లీ ఇవ్వాల (01.11.2025) పేపర్లో బెంగుళూరులో జరిగిన వార్త చదువుతుంటే అదే ఉదంతం గుర్తుకు వచ్చింది. 35 సం॥ల వయస్సున్న తల్లి 15 సం॥ల వయస్సున్న తన కూతురి ప్రవర్తన నచ్చక, యువకులతో అలా తిరగవద్దని మందలిస్తే, ఆ కూతురికి ఇది రుచించక, తల్లిపై కోపం పట్టలేక 17 ఏళ్ళలోపు వయస్సున్న తన స్నేహితుల (బాలుర)తో పథకం పన్ని, వారిని తన ఇంటికి తీసుకవచ్చింది. ప్రక్క గదిలో నవ్వులు, కేరింతలు విని నిద్ర పోతున్న తల్లి లేచి చూడగా "నల్గురు బాలురతో తన కుమార్తె అభ్యంతరకర స్థితిలో ఉండడాన్ని చూసి గట్టిగా మందలించింది. అప్పటికే పథకం వేసుకున్న వారంతా ఆతల్లిని చుట్టు ముట్టి, నోటిని మూసి, గొంతును తువ్వాలుతో బిగించి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని చీరతో ఫ్యాన్‌కు వేలాడదీశారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. మరునాడు ఆ ఇంటికి వచ్చిన మృతురాలి సోదరి. మృతదేహాన్ని గుర్తించి, స్థానికులు, బంధువుల సాయంతో అంత్యక్రియలకు సిద్ధమయ్యారు. అయితే తల్లి అంత్యక్రియలకు ఆ బాలిక రాకపోవడంతో అనుమానం వచ్చి, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, హత్యోదంతం వెలుగుచూసింది. ఇప్పుడు నేరమెవరిదంటే, ఏమి సమాధానం చెప్తుతాం? 15 సం॥ల వయస్సున్న అమ్మాయి తాను ఏమి చేస్తున్నదో, దాని పరిణామం ఎలా ఉంటుందో ఆలోచించి చేసిందా? ఆ వయస్సు పిల్లకి తండ్రి అప్పటికే లేదు. తల్లిని హతమార్చింది! ఇప్పుడు జీవన గమనం ఏమిటి ? నేరమెవరిది? "అలా కూడదమ్మా" అని మందలించిన తల్లిదా, తానేమిటో తెలుసుకోలేని వయసులో ఉన్న కూతురిదా? ఆ అమ్మాయి అలా ఎందుకు తయారైందనే ప్రశ్నకు ఏమి సమాధానం దొరుకుతుంది?

స్వామి రామతీర్థ వద్దకు ఒక వ్యాపారి తన ఏకైక కుమారుడిని వెంట పెట్టుకుని వెళ్ళి "వీడు ఏమీ సంపాదించక కూర్చుని తిన్నా-నాల్గు తరాలైనా తరగని సంపద నా దగ్గర ఉన్నది. కాని వీడికి ఒక్కటి కూడా మంచి లక్షణం లేదు. వీడిని మీ కాళ్ళమీద వేస్తున్నాను. ఎలాగైనా వీడిని మీరే తీర్చి దిద్దాలని వేడుకున్నాడు. అంతా విన్న స్వామిజీ "వీడి వయస్సెంత?" అని అడిగారట! 16-17 సం॥లు అని బదులిచ్చాడు. "కర్ర ఎండి పోయింది,

వంచితే వంగదు, విరిగి పోతుంది–సంస్కారాలు అబ్బాల్సిన సమయం దాటి పోయింది–తీసుకు వెళ్లు" అని సమాధానం చెప్పాడట.

సరిగ్గా ఇప్పుడు కూడా పిల్లల సంస్కారాల గురించి ఆలోచించకుండా, సంస్కారాలు అంటే ఏమిటి? ఎలా వారికి అందించాలి? అని ఆలోచించకుండా, డబ్బు సంపాదనే ప్రధానంగా, అన్నీ డబ్బుతోనే సమకూర్చుకోవచ్చు ననే భ్రమలో ఉన్న కారణంగా జరుగుతున్న పరిణామాల ప్రభావమే ఇలాంటి ఘటనలన్నీ అని అనిపిస్తున్నది.

"పిల్లలు ఎలా సంస్కారాల నుండి దూరమవుతున్నారు? దానికి కారణమేమిటి? దాన్ని ఎలా గుర్తించవచ్చు? తల్లిదండ్రులు ఎలా ఉండాలి?" అంటూ చాలా కాలం క్రితం వచ్చిన ఒక వీడియో క్లిప్పింగ్‌లోని విషయాలు, దాని నివారణ మార్గాలు గమనించి అనుసరించదగినవి.

ఈ లక్షణాలు మీ పిల్లల్లో ఉంటే వాళ్లు ఫోన్‌కు అడిక్ట్ అయ్యారని అనుకోవాలి. దీనికి సంబంధించిన నాలుగు మెట్లు చెప్పుతారు.

1. ఇంత వరకు 8–10 సం॥లుగా మీ చుట్టూ తిరుగుతున్న మీ అబ్బాయి / అమ్మాయి మీ నుండి దూరంగా ఉండే ప్రయత్నం చేయడం మొదలు పెడుతారు. ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న ఫోన్ ఎప్పుడైతే వారి చేతిలో ఉన్నదో, అప్పటి నుండి వారు మిమ్మల్ని దూరంపెట్టే ప్రయత్నం చేస్తారు. మీరు ఏదో ఒక ఫంక్షన్‌కు బంధువుల ఇంటికి వెలుతున్నారనుకోండి, అప్పుడు వారిని రండి, ఫంక్షన్‌కు వెలుదామంటే, నేను రాను మమ్మీ, నాకు కాలేజి వర్క్ ఉన్నది. నాకు హోంవర్క్ ఉన్నది అని చాడీలు చెప్పడం మొదలెట్టుతారు. తన సిస్టర్స్‌ను, తన అన్నయ్యలను, అందరిని వదిలి ఒంటరిగా ఉండడానికి ఇష్టపడుతాడు. ఇలా మొదట తాను ఒంటరిగా ఉండాలని కోరుకుంటాడు. దురదృష్టవశాత్తు ఇవ్వాల్టి మన కుటుంబాల్లో తాతయ్యలు, నానమ్మలు, పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నమ్మ, చిన్న నాన్న ఇలా అందర్నీ కోల్పోయాము. మేమిద్దరం, మాకిద్దరు–ఇవ్వాల మాకిద్దరు కూడా కాదు ఒక్కరే. అపార్టుమెంటులో పేరెంట్స్ బెడ్‌రూం, చిల్డ్రన్స్ బెడ్‌రూం, గెస్ట్‌రూం–ఇలా మూడు గదులున్న ఇల్లు కావాలి మనకు. సంతానం ఒక్కరున్నా లేదా ఇద్దరు పిల్లలున్నా ఒకరు ఒక బెడ్‌రూంలో, ఇంకొకరు ఇంకొక బెడ్‌రూంలో... రాత్రి తొమ్మిదవతూనే తలుపు పెట్టేసుకుంటారు. ఏమి జరుగుతుందో తెలియదు. ఎవరి లోకంలో వారుంటారు–ఓపెన్ చేస్తే వారి చిట్టా అంతా బయటపడుతుంది. ఒక రోజున ఒక చోట చూశాను. సెల్‌ఫోన్ ఓపెన్ చేసి చూస్తే మొత్తం అవ్వే ఫోర్నోగ్రఫి వీడియోలు. తల్లితండ్రులను అడిగితే **"లేదండి! మా అబ్బాయి/అమ్మాయికి అటువంటి కల్చర్ లేదండి"** అని చెప్పుతారు. అవును! మనకు తెలియకుండా ఉండడానికే వారు చేసే డ్రామా. ఇది మొదటి మెట్టు. ఈ సమయంలో వాళ్ళపై ఒక కన్ను వేయండి.

2. మీరు చెప్పే మాటను పెడ చెవిన పెడుతారు. "నీకేం తెలియదమ్మా, సొసైటీ మారిపోయింది" అంటూ మిమ్మల్ని రివర్స్ చేయడం మొదలెట్టుతారు. "అందుకే నిన్ను డాడి అలా అంటాడు, నువ్వేమి పెద్ద మంచిదానివా? నీకేమి తెలుసు, ఊర్కో మమ్మీ" పాపం! ఆ తల్లి ఏమిచేయలేని పరిస్థితి. తన చేతులతో పెంచిన కుర్రాడు/అమ్మాయి తన కళ్ళముందు –10వ తరగతి, ఇంటర్ మీడియట్ చదివే స్టేజికి వచ్చేసరికల్లా **"నీకేమి తెలియదు పో"** అంటుంటాడు. ఆ తల్లికి ఏమి చేయాలో అర్థం కాదు. ఇలా మిమ్మల్ని ఎదిరించి మాట్లాడడం రెండవ మెట్టు.

3. తర్వాత తన చుట్టూ ఉన్న సొసైటీని, తన ఫ్రెండ్స్‌ను అవైడ్ చేస్తూంటారు. ఇది మూడవ మెట్టు.

4. ఈ స్టేజీలో పూర్తిగా మారిపోతారు. ఎవరిని చూసినా "కామ" దృష్టితో చూస్తారు. ఇంటికి ఎవరు వచ్చినా అదే దృష్టితో చూస్తారు. ఎవరితో మాట్లాడినా అదే దృష్టి, దురదృష్టం కొద్ది సినిమాలు కూడా అలా తయారయ్యాయి. ఇంట్లో టి.వి.ల్లో సినిమాలు ఒకప్పుడు సెన్సార్ కటింగ్ ఉండేది. ఇప్పుడు అదీ కనిపించడం లేదు. ఇప్పుడు ఈ స్థితిలో కుర్రాళ్లు ఇలా తయారుకాక పోతే ఏమవుతారు?

(తరువాయి భాగం 30వ పుటలో...)

# పునాది అక్షరాస్యత



– కొత్తపల్లి ఉమ,
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ

**NEP 2020 లో పునాది అక్షరాస్యత (FLS)**

**ప్రశ్న: పునాది సంవత్సరాలలో భాషా అభ్యాసం ఎందుకు ఎంతో ముఖ్యమైనది?**

→ పునాది సంవత్సరాలు (చిన్న పిల్లల దశ)లో భాషా అభ్యాసం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఈ దశలోనే పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. మరియు ఎక్కువగా అనుకూలంగా (flexible) ఉంటుంది. ముఖ్య కారణాలు ఇవి:

**1. ప్రారంభ దశలోనే మెదడు అభివృద్ధి అత్యంత బలంగా ఉంటుంది.**

→ చిన్న వయస్సులో పిల్లల మెదడు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ దశలో భాషను నేర్చుకోవడం వల్ల ఆలోచన, జ్ఞాపకశక్తి సమస్యలను పరిష్కరించే సామర్థ్యాలను బలపరచే న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయి.

**2. అన్ని అభ్యాసాలకు పునాది.**

→ సూచనలు అర్థం చేసుకోవడానికి, ప్రశ్నలు అడగడానికి, ఆలోచనలను వ్యక్తపరచడానికి పిల్లలు ఉపయోగించే ప్రధాన సాధనం భాష. బలమైన భాషా నైపుణ్యాలు చదవడం, రాయడం, గణితం, విజ్ఞానశాస్త్రం వంటి అంశాలను సులభంగా నేర్చుకోవడంలో సహాయపడతాయి.

**3. సామాజిక మరియు భావోద్వేగ అభివృద్ధి.**

→ భాష పిల్లలకు తమ భావాలను తెలియజేయడానికి, సంబంధాలను ఏర్పరచుకోవడానికి, ఇతరులను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఇది ఆత్మవిశ్వాసం, సహానుభూతి మరియు ఆరోగ్యకరమైన భావోద్వేగ వికాసాన్ని ప్రోత్సహిస్తుంది.

**4. భవిష్యత్తులో మెరుగైన అక్షరాస్యత.**

→ శబ్దాలు, పదాలు, వాక్య నిర్మాణాలకు చిన్న వయస్సులో పరిచయం ఉంటే, పాఠశాలలో చదవడం మరియు రాయడం చాలా సులభమవుతుంది. ప్రారంభ దశలో బలమైన భాషా నైపుణ్యాలు ఉన్న పిల్లలు సాధారణంగా మంచి పాఠకులుగా మారుతారు.

**5. సాంస్కృతిక గుర్తింపు మరియు అనుబంధం.**

→ ఇంటి లేదా సమాజ భాషను నేర్చుకోవడం వల్ల పిల్లలు తమ కుటుంబం, సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధాన్ని పెంపొందించుకుంటారు. ఇది వారిలో చెందిన భావన (sense of belonging) మరియు గుర్తింపును పెంచుతుంది.

**6. బహుభాషా అభ్యాసం సులభం.**

→ చిన్న పిల్లలు పెద్దవారితో పోలిస్తే అనేక భాషలను సహజంగా సులభంగా నేర్చుకోగలరు. చిన్న వయస్సులో భాషా పరిచయం ఉచ్చారణ మరియు వినికిడి నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.

**7. దీర్ఘకాలిక విద్యా విజయం.**

→ పునాది భాషా నైపుణ్యాలు బలంగా ఉన్న పిల్లలు విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని, జీవితాంతం సమర్థవంతంగా సంభాషించగలరని పరిశోధనలు చూపిస్తున్నాయి.

**8. ఆలోచన మరియు తార్కికతకు మద్దతు.**

→ భాష ఆలోచనతో గట్టిగా అనుసంధానమై ఉంటుంది. ముందు, తరువాత, ఎందుకు, ఎందుకంటే వంటి పదాలను పిల్లలు నేర్చుకున్నప్పుడు. వారు తార్కికంగా ఆలోచించడం, క్రమంగా ఆలోచనలు అమర్చడం, కారణ–ఫలిత సంబంధాలను అర్థం చేసుకోవడం కూడా నేర్చుకుంటారు.

**9. దృష్టి మరియు స్వీయ నియంత్రణను పెంపొందిస్తుంది.**

→ భాషను ఉపయోగించడం వల్ల పిల్లలు నియమాలను అనుసరించడం. జాగ్రత్తగా వినడం, తమ ప్రవర్తనను నియంత్రించడం నేర్చుకుంటారు (ఉదాహరణకు– పనిని చేసుకుంటూ తమతో తాము మాట్లాడుకోవడం), ఇది ఏకాగ్రతను మరియు తరగతి సిద్ధతను పెంచుతుంది.

**10. జిజ్ఞాసను మరియు ప్రశ్నించే స్వభావాన్ని ప్రోత్సహిస్తుంది.**

→ ప్రపంచం గురించి ప్రశ్నలు అడగడానికి భాష పిల్లలకు సాధనాలను ఇస్తుంది. వారు చూసినదాన్ని పేరు పెట్టి, వివరించి, చర్చించగలిగినప్పుడు వారి ఆసక్తి మరింత పెరుగుతుంది.

**11. ప్రారంభ దశలోనే అభ్యాస లోపాలను తగ్గిస్తుంది.**

→ చిన్న వయస్సులో బలమైన భాషా పరిచయం ఉండటం వల్ల తరువాతి తరగతుల్లో విద్యా సమస్యలు తక్కువగా ఉంటాయి. ప్రారంభంలో భాషను బాగా అభివృద్ధి చేసుకున్న పిల్లలు చదవడం. అర్థం చేసుకోవడంలో తక్కువగా ఇబ్బందులు పడతారు.

**12. వినికిడి మరియు సంభాషణ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.**

→ పునాది భాషా అభ్యాసం వినికిడి నైపుణ్యాలను బలపరుస్తుంది. ఇవి సూచనలను అర్థం చేసుకోవడానికి, చర్చల్లో పాల్గొనడానికి, సహకారంతో నేర్చుకోవడానికి అత్యంత అవసరం.

**13. ఆత్మవిశ్వాసం మరియు స్వతంత్రతను పెంచుతుంది.**

→ పిల్లలు తమ భావాలను స్పష్టంగా వ్యక్తపరచగలిగితే వారికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారు చురుకుగా పాల్గొంటారు. స్వయంగా నిర్ణయాలు తీసుకుంటారు, సమస్యలను స్వతంత్రంగా పరిష్కరించగలుగుతారు.

**13.1 ఆత్మవిశ్వాసం మరియు స్వతంత్రతను పెంపొందిస్తుంది.**

→ తమ భావాలను స్పష్టంగా వ్యక్తపరచగలిగే పిల్లలు ఎక్కువ ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉంటారు. వారు చురుకుగా పాల్గొంటారు, నిర్ణయాలు తీసుకుంటారు, సమస్యలను స్వతంత్రంగా పరిష్కరించగలుగుతారు.

**14. ఆట మరియు ఊహాశక్తికి మద్దతు ఇస్తుంది.**

→ భాష నటన ఆటలను, కథనాలను, సృజనాత్మకతను మరింత సమృద్ధిగా చేస్తుంది. ఆటల ద్వారా పిల్లలు కొత్త పదసంపదను. సామాజిక పాత్రలను, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను అభ్యాసం చేస్తారు.

**15. కుటుంబ బంధాలను బలపరుస్తుంది.**

→ ఇంట్లో మాట్లాడటం, చదవడం, కథలు చెప్పడం వల్ల పిల్లలు–సంరక్షకుల మధ్య బలమైన భావోద్వేగ బంధాలు ఏర్పడతాయి. ఇది పిల్లలకు సురక్షితమైన అభ్యాస వాతావరణాన్ని అందిస్తుంది.

**16. నియమాలు మరియు విలువలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.**

→ పెద్దలు తను ఆశయాలు, విలువలు, సామాజిక నియమాలను పిల్లలకు తెలియజేయడానికి భాషను ఉపయోగిస్తారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో ...)

### భారీ స్థాయిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు -

# పంచ పరివర్తను ఆచరణలో చూపించిన విద్యాపీఠం



✍ - అన్నావజ్జల శ్రీనాథరావు

**పూ**ర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు తిరిగి కలుసుకున్నారు. ఇందుకు కామారెడ్డి ఉన్నత పాఠశాల ఒక వేదిక అయితే, భైంసా పాఠశాల మరో వేదిక అయ్యింది. ఒకరినొకరు ఫోన్లో పలుకరించుకున్నా... అప్పుడప్పుడూ కలుసుకుంటున్నా... పాఠశాలలో తిరిగి అందరూ కలుసుకోవడం ఎనలేని సంతోషాన్ని, సంతృప్తినీ అందించింది. తమకు పాఠాలు, విద్యాబుద్ధులు నేర్పించిన ఆచార్యులను తిరిగి కలుసుకొని విద్యార్థులు కృతజ్ఞత తెలుపుకుంటే... తమ చేత్తో అక్షరాలు దిద్దించిన విద్యార్థులు ఇంత పెద్దవారయ్యి, సమాజంలో స్థిరపడినందుకు ఆచార్యులు తెగ సంబరపడిపోయారు.




ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు ఒకరినొకరు పలకరించుకొని, తమ పాత జ్ఞాపకాలను గుర్తేసుకున్నారు. వక్తలు ఇచ్చిన సందేశాలను శ్రద్ధగా విన్నారు. వారి కర్తవ్యాన్ని పదే పదే గుర్తేసుకుంటూ ఇళ్లకు చేరుకున్నారు.

**భైంసాలో** :

శ్రీ సరస్వతీ శిశు మందిరాల ఆధ్వర్యంలో CBSE పాఠశాలలు కావాలన్న ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోందని, దీనికి తగ్గట్టుగా పూర్వ విద్యార్థులు కూడా యోజన చేస్తున్న విద్యాభారతి దక్షిణ మధ్య సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర రెడ్డి అన్నారు. ఇప్పటికే శారదాధామం కేంద్రంగా శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో CBSE పాఠశాల ప్రారంభమైందన్నారు. దీని ప్రేరకంగానే తాము కూడా ఓ CBSE పాఠశాల పెట్టిన ఆకాంక్ష పెరిగిందన్నారు. అలాగే గడచిన యేడాది ఓ దాత 14 ఎకరాల భూమిని దానం చేస్తే విద్యా భారతి విజ్ఞాన కేంద్రం అనే పేరతో CBSE ని ప్రారంభించామన్నారు. అలాగే విజయవాడ సమీపంలో సైనిక్ స్కూల్ కూడా ప్రారంభమైందన్నారు. అలాగే సంగారెడ్డిలో విద్యాభారతి చేస్తున్న పనికి ఆకర్షితులైన హితైషులు కట్టడానికి ముందుకు వచ్చారని వెల్లడించారు. అలాగే మన తెలంగాణలో విద్యా భారతి ఆధ్వర్యంలో యూనివర్సిటీ నిర్మాణం కోసం 100 ఎకరాలివ్వడానికి ఓ హితైషి ముందుకు వచ్చారని వెల్లడించారు.

ఇవ్వాళ ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో అల్లకల్లోలాలు నడుస్తున్నాయని, అయినా..అందరూ భారత్ వైపే చూస్తున్నారని అన్నారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో నేడు దేశ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను విస్మరించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా భగవద్గీత, రామాయణ, భాగవతాలను చదవడంపై శ్రద్ధ వహించడం లేదన్నారు. నేడు కార్పొరేట్ చేతుల్లో విద్య వ్యాపార రంగంగా మారిందని, తల్లిదండ్రులు సైతం విలాసాలకు ప్రాధాన్యమివ్వడం శోచనీయం అన్నారు.

విద్యా భారతి ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశుమందిరాలు ఏర్పడ్డాయని, దేశ వ్యాప్తంగా 24 వేల శిశు మందిరాలు నడుస్తున్నాయని వివరించారు. ఈ పాఠశాలల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి

శ్రీనివాసరావు గారు, ఆదిలాబాద్ విభాగ్ పూర్వ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డిలో...**

కామారెడ్డి ఉన్నత పాఠశాల కేంద్రంగా పూర్వ విద్యార్థుల – పూర్వ ఆచార్యుల మహా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు హాజరవ్వగా.. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రాంత విద్యాపీఠం సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి 1100 మంది పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆచార్య కసిరెడ్డి మాట్లాడుతూ మనమందరమూ సరస్వతీ దేవి శిష్యులమని తెలిపారు. మనం ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదని తెలిపారు. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలని, దీని ద్వారా మన బుద్ధి వికాసం జరుగుతుందని వివరించారు.

ఇక... ముఖ్య వక్తగా విచ్చేసిన పతకమూరి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ.. శిశు మందిరాలు క్రమశిక్షణకు మారుపేరు అని తెలిపారు. చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు అందించే విద్యాసంస్థ విద్యాపీఠం అని గుర్తుచేశారు. శ్రీ సరస్వతీ శిశు మందిరాల్లో చదువుకున్న విద్యార్థులు మంచి మంచి స్థానాల్లో స్థిరపడి, దేశ సేవ చేస్తున్న హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సరస్వతీ శిశు మందిరాలు ఇంత ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సమాజం సహకారత, పూర్వ ఆచార్యుల సహకారాలు ఎంతో వుందన్నారు. అలాగే ప్రస్తుతం శ్రీ సరస్వతీ శిశు మందిరాలు మరింత విస్తరణ దిశగా వెళ్తున్నాయి. CBSE పాఠశాలలు, ఇంటర్నేషనల్ స్కూల్స్ వైపు వెళ్తున్న, ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమైందని గుర్తుచేశారు. శిశు మందిరాల విస్తరణకు, పటిష్ఠతకు పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు విశేషంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, పూర్వ విద్యార్థి పరిషత్ బాధ్యులు హరిస్మరణ్ రెడ్డి, పూర్వ ఆచార్యులు పాల్గొన్నారు.

'పంచపరివర్తన్'ను ఆచరణలో చూపించిన విద్యాపీఠం....


రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్య శతాబ్ది సందర్భంగా పంచ పరివర్తన్ అన్న ఉద్దేశ్యాన్ని ఆచరించాలని నిర్ణయించారు. ఇందులో పర్యావరణం కూడా ఒక అంశమే. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని అస్సలే వాడొద్దని, ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ గిన్నెలు వాడొద్దన్నది అందులో నిబంధన. ఈ మధ్య కందికల్ గేట్, భైంసా, కామారెడ్డిలో 1000 కి పైగానే పూర్వ విద్యార్థులు సమ్మేళనాలకు హాజరయ్యారు. ఈ మూడు భారీ సమ్మేళనాలలో ఎక్కడ కూడా విద్యాపీఠం ప్లాస్టిక్ విస్తళ్లు గానీ, ప్లాస్టిక్ గ్లాసులు గానీ వాడలేదు. పూర్తిగా పర్యావరణ హితమైన వాటినే ఉపయోగించారు.

ఒక ప్రణాళిక ప్రకారం.. సమాజం నుంచి స్టీల్ పళ్లాలు, స్టీల్ గ్లాసులను సేకరించి మరీ... పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భోజనాలు జరిగాయి. కందికల్ గేట్ వారు మోదుగు విస్తళ్లలో భోజనం చేశారు. కామారెడ్డి పాఠశాల వారు స్టీల్ పళ్లేలు సేకరించారు. స్టీల్ గ్లాసులు కూడా సేకరించి, భోజన కార్యక్రమం చేశారు. అలాగే భైంసాలో కూడా దాదాపు 2000 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అక్కడి బాధ్యులు కూడా ముందుగానే యోజన చేసి, ఆయా కుల సంఘాలు, సమాజంలోని వారి నుంచి స్టీల్ పళ్లేలను సేకరించి మరీ, అందులో భోజనం పెట్టారు. కాస్త కష్టమైనా... పంచపరివర్తన్ కచ్చితంగా సాధ్యమేనని విద్యాపీఠం నిరూపించింది, ఆచరణలో పెట్టింది. ★



**కోరుట్ల:–** శ్రీ సరస్వతీ శిశుమందిర్ కోరుట్ల పాఠశాలలో మాతృహస్త భోజనం ★

# ఏది సత్యం? ఏది అసత్యం?



**పుస్తకం పేరు : చరిత్రలో చొప్పించిన వికృతులు**

సంకలన కర్త : శ్రీ లింగం సుధాకర్‌రెడ్డి గారు,
విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి,
విద్యాభారతి అఖిలభారతీయ ప్రచార, ప్రసార విభాగ్ ప్రభారి

**పుస్తక పరిచయం :** అద్దేపల్లి నరసింహారావు


**“అ**ందుకే ప్రసిద్ధ చరిత్ర కారుడు ప్రొ॥రమేష్ చంద్ర మజుందార్ ‘ఇలాంటి చరిత్రను చదివించడం కంటే చదివించకపోవడం మంచిది’ అన్నారు” అని **‘చరిత్రలో చొప్పించిన వికృతులు’** వ్యాస సంకలన కర్త శ్రీలింగం సుధాకర్‌రెడ్డి గారు – ఈ పుస్తకం మొదట్లో రాసిన తన **‘మనోగతం’**లో ఉట్టంకించారు. ఎలాంటి చరిత్ర గురించి ప్రొ॥రమేష్ చంద్ర మజుందార్ ఆ విధంగా వ్యాఖ్యానించారు ? ఈ ప్రశ్నకు సమాధానమే ఈ పుస్తకం. మన దేశ చరిత్ర గురించి వ్యాప్తిలో ఉన్న అనేక తప్పుడు భావనలను సునిశితంగా పరిశీలిస్తూ, పరిశోధిస్తూ సాగిన ఈ చిన్న పుస్తకం చదివిన వారికి ఒక కొత్త దృక్పథం ఏర్పడుతుంది. ఆ దృక్పథం వాస్తవాల ఆధారంగా నిర్మించినది కావడంతో మన దేశ గతం, వర్తమానం, భవిత … అన్నింటి పట్లా పాఠకులకు సరికొత్త చూపు లభిస్తుంది. **‘మనది పరాజయ చరిత్ర కాదు. స్వాభిమాన చరిత్ర’** అని ప్రకటించిన రచయిత పాఠకులలో కూడా ఆ స్ఫూర్తిని నింపుతారు. అక్కడితో ఆగక రచయిత ఇకపై జరగాల్సినదేమిటో కూడా ఇలా స్పష్టం చేశారు…. “కావున విదేశీ కుట్రలు, కుతంత్రాలను ఛేదించి రాబోవు తరానికి వాస్తవ చరిత్రను అందించి జాతీయనిష్ఠ, స్వాభిమానం గల వారిగా తయారుచేయు బాధ్యత చరిత్రకారులు, ఉపాధ్యాయులు, సామాజిక వేత్తల పైన ప్రముఖంగా ఉన్నది”.




**“శస్త్రేణ హతా నిహతాభవంతి
ప్రజ్ఞా హతాంశ సుహతా భవంతి” …..** అంటే ‘ఒక సమాజం ఆయుధంతో చంపితే పూర్తిగా చంపబడదు. ప్రజ్ఞను, బుద్ధిని భ్రమింప చేయండి. సంపూర్ణ సమాజం నాశనం అవుతుంది’. “సరిగ్గా ఇదే పని చేశారు ఆంగ్లేయులు” అని రచయిత విశ్లేషించారు. ఈ ‘భయంకర కుట్ర’ని, ‘మాక్స్ ముల్లర్ అంతరంగాన్ని’, ‘వేదాల వక్రీకరణ’ ను, ‘బ్రిటిష్ వారు, వారి దృష్టితో రాసిన చరిత్ర’ ను, ‘మెకాలే విద్యా విధానాన్ని’, ‘కమ్యూనిస్టుల గుప్త యోజన’ ను, ‘ఉన్నత విద్యలో కుట్ర’ ను, …. క్లుప్తంగా అయినా అత్యంత సూటిగా రచయిత వివరించిన తీరు పాఠకులను విధిగా ఆలోచింపజేస్తుంది, ఆచరణకు దిశానిర్దేశం చేస్తుంది.

సమకాలీన సంఘటనలను, వివిధ గ్రంథాలలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ సాగిన ఈ రచన ‘మరో జాతీయ ఉద్యమం అవసరం’ అని తేల్చిచెప్పింది.

ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ఐ.పి.యస్. అధికారి, ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ డీజీపీ శ్రీ కె.అరవిందరావు గారు **“చరిత్ర పట్ల అవగాహన లేకుంటే మనం ప్రస్తుతం ఉన్న భావదాస్యమే కాకుండా రాజకీయ దాస్యంలోకి కూడా వెళ్లే ప్రమాదం ఉంది”** అని హెచ్చరించారు. అంతేకాదు.




**“సత్యమేవ జయతే** అనే మాట ఉన్నప్పటికీ సత్యం జయించాలంటే దాన్ని తెలుసుకుని చాటిచెప్పే వారు ఉండాలి. అలాంటి చారిత్రక పరిశోధన మనకెంతో అవసరం” అనికూడా శ్రీ కె.అరవిందరావు గారు తేల్చి చెప్పారు. అలాంటి సత్యాన్వేషణ దిశలో సాగిన ప్రయత్నమే ఈ **‘చరిత్రలో చొప్పించిన వికృతులు’** పుస్తకం!

★

**ప్రతుల కోసం**

శ్రీసరస్వతీ విద్యాపీఠం, సాహిత్య విభాగం,
ఇం.నెం.6-3-597/ఎ/7, వెంకటరమణ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్-04.
ఫోన్.నెం.040-23316084, 9441866647లో సంప్రదించవచ్చు.
వెల: రూ॥30/-లు,

(24వ పుట తరువాయి భాగం ...)

చట్టాలు, మానవ హక్కులు ఎన్ని మాట్లాడుకున్నా, ముందు ఇంటి వాతావరణంలో వారిని మనం కంట్రోల్ చేయకపోతే, సొసైటీలో ఏమి కంట్రోల్ చేస్తాము. పేరెంట్స్ వారికి మొదటి ప్రాధాన్యం తరువాత కాదు, పేరెంట్స్ కంట్రోల్ చేయకుండా సమాజంలో ఒక చీడ పురుగులాగ వారిని వదిలి పెడితే సమాజంలో వేలకొలది జరుగకూడనివి జరుగుతుంటే చూడాల్సివస్తుంది. వాటిని కంట్రోల్ చేయాల్సిన ఆవశ్యకత పేరెంట్స్ పైననే ఉన్నది. దీన్ని ఎలా కంట్రోల్ చేయాలి? ఎక్కడ మొదలెట్టాలి? అని అనుకున్నప్పుడు అది ఇంట్లోనే మొదలవ్వాలి.

కొన్ని ఇండ్లలో పిల్లల ముందు అభ్యంతరకర బట్టలు వేసుకొని తిరిగిన పేరెంట్స్‌కూడా ఉన్నారు. ఇది చెప్పుకోవడానికి చాలా సిగ్గు చేటు. పిల్లల్ని విడిగా పెద్దల్ని విడిగా మాట్లాడి నప్పుడు పిల్లలు చెపుతుంటారు. మీరు చెపుతున్నారు కాని అంకుల్ మా పేరెంట్స్ చిన్న చిన్న దుస్తులు వేసుకొని అలా తిరుగుతుంటారు. మేమేమి చేయాలి అంకుల్–నా పేరెంట్స్‌తో నేను చెప్పలేను కదా! అంటారు.

పాశ్చాత్య ప్రభావం ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల పైన బాగా పడింది. ముఖానికి బొట్టు పెట్టుకోవడముండదు, జడ వేసుకోవడం ఉండదు, చేతులెత్తి నమస్కారం పెట్టే సంస్కృతి పోయింది. పిల్లల ముందు సత్సంప్రదాయాన్ని పాటించండి. సంఘ విధ్వంసక శక్తులు కాకుండా సమాజానికి ఉపయోగ పడేట్లుగా తయారు చేయండి. మీ వ్యవహారమే ఆదర్శంగా ఉండాలి గాని, మిడ్డీల లంగా, పొట్టి దుస్తులు వేసుకుని. పెద్ద సౌండ్ పెట్టుకొని పిల్లల ముందు తల్లితండ్రులిద్దరు డ్యాన్సులు చేస్తుంటారు. అమ్మ స్థానంలో ఉన్న వ్యక్తి ఒక బెల్లి డ్యాన్సు చేస్తుంటే, నడుము ఊపుతుంటే పిల్లలకు ఏమి సంస్కృతిని మనం అందిస్తున్నట్లు. మన వ్యవహారం పిల్లల మనసులో ప్రింటయి పోతుంది. సంస్కారాలు చూసి నేర్చుకుంటారు–వారు తల్లిదండ్రులనే చూస్తుంటారు. వారినే అనుకరిస్తారు. చిన్న వయస్సులో వాళ్లు ఏమి చేస్తున్నారో, రాబోవు కాలంలో దాని పరిణామం ఎలా ఉంటుందో, జీవితంపై దాని ప్రభావం ఎలాపడనున్నదో వారికేమి తెలుసు?.... కాని మనకు తెలిసి ఉండాలి. కావున ఆ దిశలో సంస్కారవంతమైన సమాజ నిర్మాణంలో పోషకులదే ప్రధాన బాధ్యత. ★

---

(16వ పుట తరువాయి భాగం ...)



2. విద్యార్థి పేరు : పున్నేవాడ్ పల్లవి
పదో తరగతి, భైంసా, సుభద్రానిలయం

నేను శ్రీశారదాధామంలో జరిగినటువంటి ప్రతిభా తరగతుల వర్గలో పాల్గొనడం వల్ల సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో నేర్చుకున్నాను. ప్రశ్నపత్రాల తీరుపై పూర్తి అవగాహన కలిగింది. అలాగే క్రమశిక్షణ విధానం బాగా నచ్చింది, అన్ని విషయాలు ఒకే రోజులో ఎలా చదవవచ్చో తెలుసుకున్నాను. ఈ వర్గలో, వసతి చాలా బాగా కల్పించడం జరిగింది. ప్రతి విషయంపై క్విజ్ మరియు పరీక్షల నిర్వహించడం చాలా ఉపయోగపడింది. తెలుగు, హిందీ , ఇంగ్లీష్ విషయాలలో వ్యాకరణాంశాలను పూర్తిగా నేర్చుకున్నా. దానితో పాటు పెద్దల మోటివేషన్ నా జీవితానికి ఎంతో వర్గ ద్వారా నేను మార్చిలో జరగబోయేటువంటి వార్షిక పరీక్షలలో చక్కగా ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధిస్తానన్న నమ్మకం వచ్చింది.

3. విద్యార్థి పేరు: శ్రీహర్షిత్,
10వ తరగతి, కామారెడ్డి ఉన్నత పాఠశాల



ఉత్తమ ప్రతిభా విద్యార్థుల వర్గకు హాజరవ్వడం చాలా ఆనందంగా వుంది. చాలా విషయాలు నేర్చుకున్నా. ప్రతి విషయంపై క్విజ్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ పరీక్షలు కూడా నిర్వహించారు. దీంతో ప్రతి సబ్జెక్టుపై నా అవగాహన మరింత రెట్టింపైంది. సమయపాలన, పోటీతత్వం నేర్చుకున్నా. మాకు పోషకాలతో కూడిన ఆహారాన్ని ఇచ్చారు. వర్గ మరచిపోలేని అనుభూతిని కలిగించింది.

(తరువాయి భాగం 34వ పుటలో...)

# సైనిక్ స్కూల్‌లో ఎలా చేరాలి?

– శ్రీమతి ఎల్లా స్వప్నా నాయుడు,
వైస్ ప్రిన్సిపాల్, నేతాజీ సైనిక్ స్కూల్, కేతనకొండ–విజయవాడ

## సైనిక్ స్కూల్ ఎందుకు ?

ప్రతి తల్లిదండ్రి తమ సంతానము క్రమశిక్షణ కలిగిన, ఆత్మ విశ్వాసముతో కూడిన, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వం గలవారుగా తయారవ్వాలని కోరుకోవడం సహజం . నిర్ణీత లక్ష్యాలతో నిర్వహింపబడే సైనిక్‌స్కూల్, తల్లిదండ్రుల ఆలోచనల అంచనాలకు మించి అటువంటి వ్యక్తిత్వం గల బాలబాలికలను అందజేయగలుగుతుంది.

సైనిక స్కూల్ తన తరగతి గదిలో సి.బి.యస్.ఇ. సిలబస్‌తో కూడిన విద్యాసంబంధమైన విషయాలతో పాటు విలువలను నిర్మాణం చేసే విషయాలను ప్రేరణాత్మకంగా ప్రబోధిస్తుంది. ఒక ప్రత్యేక దైనందిన సమయసారిణిని ఏర్పాటు చేసుకొని బాలబాలికలలో జీవన నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు పాఠశాల లోపల, బయట సహజ వాతావరణాన్ని కలిగియుంటుంది.

విద్యార్థులు తమ జీవితాలను అర్థవంతంగా కొనసాగించేందుకు, ఆనందంగా, సహజంగా జీవన లక్ష్యాలను చేరుకొనే బాటలు వేసుకొనేందుకు సైనిక్ స్కూల్ ఒక ఆధారం అవుతుంది. 24 గంటలు సుశిక్షుతులైన ఉపాధ్యాయులు మరియు త్రివిధదళములలో అనుభవం గడించిన శిక్షకుల పర్యవేక్షణలో విద్యార్థులు ఉంటున్న కారణంగా వ్యక్తిగతంగా ప్రోత్సహింపబడుతూ, తమ ప్రతిభలను ప్రదర్శింపచేసుకొనే అవకాశాన్ని కలిగి యుంటారు.

## క్రమశిక్షణ–సంరక్షణ :

విద్యార్థులలో మంచి అలవాట్లతో పాటు ఎటువంటి పరిస్థితులలోనైనా ధైర్య, సాహసాలను ప్రదర్శించే మనో ధైర్యాన్ని, నైపుణ్యాలను సైనిక్ స్కూల్ కలుగజేస్తుంది. ఖచ్చితమైన సమయపాలన, వ్యక్తిగత, బాహ్య శుభ్రతల పట్ల నిష్ఠ, ప్రతిపనిలో గౌరవ భావంతో కూడిన శ్రద్ధ, ఆదరణ భావన, పౌర విధులను సహజంగా నిర్వహించగలిగే స్వభావాన్ని కలుగజేస్తుంది. శారీరిక దృఢత్వముతో పాటు భావాత్మకమైన మానసిక, బౌద్ధిక సామర్థ్యాలను, తాము ఎంచుకొనే ఏ రంగంలోనైనా విజయం సాధించగలిగే నైపుణ్యాలను సైనిక స్కూల్ తన ప్రత్యేక కార్యకలాపాల ద్వారా విద్యార్థులలో నిర్మాణం చేస్తుంది.

## జీవన లక్ష్యాలను సాకారం చేసుకొనేందుకు, ఆధారంగా నిలిచే ఆవాస వ్యవస్థ :

సాధారణంగా ప్రతి సైనిక్ స్కూల్ ఆవాస విద్యాలయంగానే నిర్వహించబడుతుంది. ఆవాస జీవన విధానము ద్వారా ఒక సామూహిక వ్యవస్థలో అతి తక్కువ సమయంలో తన వ్యక్తిగత పనులు పూర్తి చేసుకొని తన జీవన పద్ధతి ఇతరులకు ఆటంకం కలుగని రీతిలో ఒక ఆదర్శవంతమైన దైనందిన జీవితాన్ని అలవాటు చేసుకోవడంలో సైనిక స్కూల్ ఆవాస వ్యవస్థ ఉపకరిస్తుంది.

24 గంటలు తనతో ఉండే శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో వివిధ నైపుణ్యాలను పెంపొందించుకొంటూ, బలవర్ధకమైన ఆహారము, వైద్యసదుపాయములు, నిరంతర పర్యవేక్షణ, విలక్షణ కార్యక్రమాల ద్వారా శారీరిక, మానసిక, బౌద్ధిక మరియు భావాత్మక సామర్థ్యాలతో పాటు సంవేదనాశీలత సహజంగా పెంపొందుతాయి.

కష్ట, సుఖాలలో పరస్పరం సహకరించుకొనే విధానము, జట్టులో ఇమిడి సమన్వయంతో పనిచేసే నైపుణ్యాలు విద్యార్థులలో పెంపొందుతాయి. ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకొనేందుకు, సైనిక దళాలలో చేరేందుకు, అవసరమయ్యే ప్రేరణ సైనిక్‌స్కూల్ కలుగజేస్తుంది. సైనిక స్కూల్‌లో విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు తాము భవిష్యత్తులో ఇంజనీరు, డాక్టర్, సివిల్ సర్వీసెస్ వంటి రంగాలలో స్థిరపడినా, లేదా తమ అభిరుచికి అనుగుణంగా ఎంపిక చేసుకున్న వివిధ వృత్తులను చేపట్టినా దేశము, ధర్మము, సంస్కృతి యెడల నిష్ఠతో తమ వృత్తి ధర్మాలను కొనసాగించేందుకు సైనిక్‌స్కూల్ ఆధారంగా నిలుస్తుంది.

## సైనిక్ స్కూల్‌లో సీటు పొందడం ఎలా?

సైనిక్ పాఠశాలలు ప్రతిష్ఠాత్మకమైన ఆవాస విద్యాలయాలు. వీటిలో సీటు సాధించడమంటే తల్లిదండ్రులు తమ సంతానం పట్ల కన్న కలలు సాకారమైనట్లుగా, విద్యార్థులు తమ జీవన లక్ష్యం చేరుకున్నట్లుగా భావిస్తారు. ప్రవేశ విధానము, ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా సైనిక్ స్కూల్ సొసైటీ విధి విధానాలను రూపొందించింది. **AISSEE (ALL INDIA SAINIK SCHOOL ENTRANCE EXAMINATION)** ను ప్రతి సంవత్సరం **NTA (NATIONAL TESTING AGENCY)** నిర్వహిస్తుంది.

ఈ జాతీయ స్థాయి పరీక్ష కులం, మతం ఆధారంగా కాకుండా అందరికి సమాన అవకాశాలను కలుగజేస్తుంది. **AISSEE** ప్రతి సంవత్సరం 5వ తరగతి పూర్తిచేసుకొని 6వ తరగతిలోకి ప్రవేశించబోయే విద్యార్థులకు 300 మార్కులతోను, 8వ తరగతి పూర్తి చేసుకొని 9వ తరగతిలో ప్రవేశించబోయే విద్యార్థులకు 400 మార్కులతోను ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. విద్యార్థులు ఖచ్చితంగా ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతకు అవసరమగు అర్హత మార్కులు సాధించాకే సీటుకొరకు జరిగే ఎంపిక విధానమునకు (కౌన్సిలింగ్) రిజిస్టర్ చేసకోవలసియుంటుంది.

### అర్హత-ఎంపిక :

సైనిక స్కూల్ సొసైటీ తాజా నియమమలకు లోబడి ప్రవేశ ప్రక్రియ ఉంటుంది. ఇట్టి సమాచారము ఎప్పటికప్పుడు సొసైటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. 6వ తరగతిలో ప్రవేశం పొందగోరు విద్యార్థులు ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణతతో పాటు మార్చి 31 నాటికి 10 నుండి 12 సం॥ల మధ్య వయస్సు వారై ఉండాలి. 9వ తరగతిలో ప్రవేశమునకు 13 నుండి 15 సం॥ల మధ్య వయస్సు ఉండాలి.

### తుది ఎంపిక మరియు ప్రవేశ విధానము :

ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా జరిగే కౌన్సిలింగ్ ద్వారా తల్లిదండ్రులు పెట్టుకున్న పాఠశాలల ఐచ్ఛికములను పరిగణించుకొని విద్యార్థికి పాఠశాల కేటాయింపు జరుగుతుంది. 8 మంది ప్రత్యేక వైద్యుల వైద్య పరీక్షలన అనంతరం, వైద్య ధృవీకరణ జరిగిన తర్వాత యోగ్యతా పత్రాల పరిశీలన నిర్ణీత ఫీజు చెల్లింపుతో పాఠశాలలో ప్రవేశం పూర్తవుతుంది. తమ కలలను సాకారం చేసుకొనేందుకు సైనిక స్కూల్‌లో ప్రయాణం ప్రారంభమౌతుంది.

### విద్యాభారతి -సైనిక్ స్కూల్ :

దక్షిణాది రాష్ట్రాలలో మొదటి సైనిక్ స్కూల్ విజయవాడలోని కేతనకొండలో వదాన్యతకు మారు పేరుగా నిలుస్తున్న శ్రీ సి.బి.ఆర్. ప్రసాద్ గారు విద్యాభారతికి దానంగా ఇచ్చిన 8 ఎకరాల భూమి మరియు నిర్మితమైయున్న 3 అంతస్తులతో కూడిన 2 భవనాలలో 2025-26 విద్యా సం॥లో ప్రారంభమైంది. కేంద్ర రక్షణ శాఖ మరియు సైనిక్ స్కూల్ సొసైటీ ఢిల్లీ ద్వారా అనుబంధ అనుమతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొంది ఈ సం॥ము 6వ తరగతితో "నేతాజీ సైనిక్ స్కూల్" ప్రారంభమైయింది.

2025-26 విద్యా సం॥లో సైనిక్ స్కూలు సొసైటీ నవంబరు మాసము వరకు కొనసాగించిన విద్యార్థి ఎంపిక ప్రక్రియ అనంతరం నవంబరు 25 నుండి "నేతాజీ సైనిక్ స్కూల్" ప్రారంభంమై సైనిక్ స్కూల్ సొసైటీకి సంబంధించిన అన్ని కార్యకలాపాలను సమర్థవంతంగా అమలుచేస్తూ అతి తక్కువ సమయంలోనే తల్లిదండ్రుల, దాతల, హితైషుల ప్రశంసలను అందుకొంటూ 2026-27 విద్యా సం॥లోకి అడుగు పెడుతున్నది.

సమాజంలో సైనిక్ స్కూల్ ఆవశ్యకతను జాగృతం చేసేందుకు, తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు, విద్యార్థులు సైనిక్‌స్కూల్‌లో ప్రవేశ అర్హతలు సాధించేందుకు 2026-27 విద్యా సం॥లో "నాన్ సైనిక్ క్లాసెస్" పేరుతో 5,6,7 తరగతులలో ప్రవేశములను ప్రారంభించడం జరిగింది. ఈ తరగతులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సంవత్సరం పొడవునా సి.బి.యస్.ఇ. సాధారణ సిలబస్‌లో తరగతులు నిర్వహిస్తూ సైనిక స్కూల్ ఎంట్రన్స్ కు అవసరమైన శిక్షణ కూడా యివ్వడం జరుగుతుంది. తల్లిదండ్రులు తమ చిన్నారుల పట్ల ఏర్పరచుకున్న కలలను సాకారం చేసుకొనేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా "నేతాజీ సైనిక్ స్కూల్" యాజమాన్యం కొరుతున్నది.

ఇతర వివరముల కొరకు ఈ దిగువ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చును. 9849616846, 7416897785,

జై జవాన్ జై భారత్,
భారతమాతాకీ జయ్

★

వార్తలు

# భైంసాలో పూర్వ విద్యార్థి సమ్మేళన సంక్రాంతి!

– సంక్షిప్త నివేదిక: అద్దేపల్లి నరసింహారావు



వేదికపై ముఖ్య అతిథి తదితరులు



విచ్చేసిన పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యులు.

**మూ**డు పాఠశాలల పూర్వ విద్యార్థుల ముచ్చటైన సమ్మేళనం అది. భైంసాలో జనవరి 11వ తేదీన రోజంతా సాగిన ఈ సమ్మేళనంతో పట్టణానికి ముందే సంక్రాంతి వచ్చినట్లు కళకళలాడింది. శ్రీసరస్వతీ శిశుమందిర్ పూర్వ విద్యార్థి పరిషత్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల, పూర్వాచార్యుల ఆత్మీయ సంగమం, చిన్నారుల ప్రతిభావంతమైన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యాభారతి పెద్దల సందేశాలు కలగలసి ... ఒక ఉత్తేజ భరిత వాతావరణాన్ని సృష్టించాయి.

**ముఖ్య విశేషాలు:-**

♦ శ్రీసరస్వతీ శిశుమందిర్-గుజరిగల్లి, పూలేనగర్ సుభద్రనిలయం, కిసాన్‌గల్లి పాఠశాల పూర్వవిద్యార్థులు, ఆచార్యుల మహా సమ్మేళనం అది. ఈ మూడు పాఠశాలలలో 1968-2000 సంవత్సరాలలో చదువుకున్న వారి కలయిక అది. ఈ కార్యక్రమం కిసాన్‌గల్లి సరస్వతీ శిశుమందిర్‌లో జరిగింది.

♦ సుమారుగా 2000 మంది పూర్వ విద్యార్థులు, 80 మంది పూర్వాచార్యులు సమ్మేళనంలో పాల్గొన్నారు. రెండు నెలల ప్రణాళిక, బాధ్యతల విభజన, సమష్టి కృషితో ఈ సమ్మేళనం ఇంతటి ఘన విజయం సాధించినట్లు పూర్వ విద్యార్థి పరిషత్ ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షులు డి.శ్రీధర్ చెప్పారు.

♦ సమ్మేళనానికి విద్యార్థులు ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా! ఐ.ఆర్.యస్. అధికారి వడ్నం నిఖిల్ (చెన్నై), అల్ట్రాటెక్ సిమెంట్ ఉన్నతాధికారి ముత్యప్‌వార్ మహేందర్ లాంటి ఉన్నత స్థానాలలో ఉన్న పూర్వ విద్యార్థులు తమ విద్యా సంస్థ కోసం ఏదైనా చేయాలనే ఆకాంక్ష, సంసిద్ధత వెలిబుచ్చారు.

♦ ఆదిలాబాద్ శైక్షణిక ప్రముఖ్ శ్రీ వేణుమాధవ్ గారు, కిసాన్‌గల్లి పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ నామాల భోజన్న గారు సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు.

♦ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి శ్రీ లింగం సుధాకర్ రెడ్డి గారు తన ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు సభికులను ఆలోచింపజేశాయి. భారతీయ సమాజానికి ఎదురవుతున్న సవాళ్ళ పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి పరిష్కార మార్గాలు మన విలువల మూలాల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పారు. యూనివర్సిటి ఏర్పాటు దిశగా ముందుకు వెళుతున్నామని ఆయన చేసిన ప్రకటనతో సభ అంతా చప్పట్లతో ప్రతిధ్వనించింది.

♦ పత్రికలు, ఛానెళ్లు సముచిత రీతిలో కార్యక్రమానికి కవరేజి ఇచ్చాయి.

♦ శ్రీ సరస్వతీ విద్యాపీఠం, ప్రాంత సంఘటనా కార్యదర్శి శ్రీ పతకమూరి శ్రీనివాసరావు గారు, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్రం క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ శ్రీ రావుల సూర్యనారాయణ గారు తదితర పెద్దలు సమ్మేళనంలో పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు.

♦ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం తర్వాత కూడా పూర్వ విద్యార్థులు అక్కడే గడిపారు. పలకరింపులు, జ్ఞాపకాల కలబోత, ఫోటోలు, నాటి ఆచార్యులకు సన్మానాలు .... వీటితో సభా ప్రాంగణం అంతా ఒకటే సంరంభం. అది విద్యార్థి సంక్రాంతి! ★

(30వ పుట తరువాయి భాగం ...)

4. విద్యార్థి పేరు : ఏ. సుప్రిత,
10వ తరగతి, కామారెడ్డి ఉన్నత పాఠశాల



ఉత్తమ ప్రతిభా విద్యార్థుల వర్గకి హాజరవ్వడం చాలా ఆనందంగా వుంది. చాలా సబ్జెక్ట్ ను అవగాహన చేసుకున్నా. మరీ ముఖ్యంగా మార్కులను బాగా ఎలా తెచ్చుకోవాలో అర్థమైంది. మేము అడిగిన ప్రతి సందేహాన్ని కూడా చాలా ఓపికగా నివృత్తి చేశారు. అలాగే ప్రతి విషయంపై క్విజ్ నిర్వహణ బాగా ఆకట్టుకుంది. మళ్లీ మరోసారి మా సబ్జెక్టులను పునశ్చరణ చేసే అవకాశం చిక్కింది. నా తప్పులను కూడా సరిదిద్దుకోవడానికి ఈ వర్గ సహాయపడింది. నాకు అవకాశమిచ్చినందుకు పాఠశాలకు ధన్యవాదాలు.

5. విద్యార్థి పేరు : నవీన్ కుమార్,
10వ తరగతి, నారాయణపేట ఉన్నత పాఠశాల



నేను శ్రీశారదాధామంలో జరిగినటువంటి ప్రతిభా తరగతుల వర్గలో పాల్గొనడం వల్ల సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో నేర్చుకున్నాను. ప్రశ్నపత్రాల తీరుపై పూర్తి అవగాహన కలిగింది. అన్ని విషయాలలో ముఖ్యమైన ప్రశ్నలను తెలుసుకున్నాను. ఈ వర్గలో భోజనము, వసతి చాలా బాగా కల్పించడం జరిగింది. ప్రతి విషయంపై క్విజ్ మరియు పరీక్షల నిర్వహించడం చాలా ఉపయోగపడింది. హిందీ, ఇంగ్లీష్ విషయాలలో వ్యాకరణాంశాలను పూర్తిగా నేర్చుకోవడం జరిగింది. ఇట్టి వర్గ ద్వారా నేను మార్చిలో జరగబోయేటువంటి వార్షిక పరీక్షలలో చక్కగా ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధిస్తానన్న మనోబలం వచ్చేసింది. ★



**శంషాబాద్:–** శ్రీసరస్వతీ శిశుమందిర్ శంషాబాద్ పాఠశాలలో సాంప్రదాయ ఆహార పదార్థాల పండుగ (ఫుడ్ ఫెస్టీవ్) ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇంటి దగ్గర తయారు చేసికొని వచ్చిన ఆరోగ్యకరమైనటువంటి ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ★



హుస్నాబాద్ :– శ్రీసరస్వతీ శిశుమందిర్ హుస్నాబాద్ పాఠశాలలో సాంప్రదాయ ఆహార పదార్థాల పండుగ (ఫుడ్ ఫెస్టీవ్) ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ కొత్తపల్లి అశోక్, కార్యదర్శి శ్రీ బబ్బుల రవీందర్, సహ కార్యదర్శి శ్రీ పోల్సని బాపురావు, ప్రధానాచార్యులు శ్రీమతి శ్రీలత మరియు మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ★



శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి ఆటల పోటీలలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, సుభద్రానిలయం, పూలేనగర్, భైంసా విద్యార్థులు. ★



గట్టుప్పల్ :- శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల,
గట్టుప్పల్‌కు శ్రీ నామాని దత్తాద్రి గారు
రూ॥50,000/-ల చెక్ ను విరాళంగా అందజేశారు.



శ్రీ సరస్వతి శిశు మందిర్ అశోక్ నగర్ మాధ్యమిక పాఠశాల ప్రధానచార్యులు పదవీవిరమణ పొందిన
శ్రీమతి కొడ్లీ విజయలక్ష్మి గారికి రూ॥5,00,000/-ల గ్రాట్యుటీ చెక్కును అందించిన
ప్రాంత సంఘటనాకార్యదర్శి శ్రీ పతకమురి శ్రీనివాసరావు విభాగ్ మరియు
పాఠశాల ప్రబంధకారిణి.



సరస్వతీ విద్యా మందిర్ భీంగల్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న యెన్ను శ్రీకరి D/O శ్రీధర్ అనే విద్యార్థి ఆర్మూర్ లో విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. నర్సారెడ్డి, అకడమిక్ ఇంచార్జ్ పి. సాయిచరణ్, వేదిక్ మ్యాథ్స్ బోధించిన ఉపాధ్యాయులు సిహెచ్. కార్తీక్, ఎన్. రాకేష్, ఆర్. రవికుమార్, డి. స్రవంతి తో పాటు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం కూడా అభినందించినారు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 02
February - 2026

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01



ముథోల్:-శ్రీసరస్వతీ శిశుమందిర్, ముథోల్ పాఠశాలలో జరిగిన ఖేల్‌కూద్ పోటీలలో శ్రీసరస్వతీ శిశుమందిర్, బోసి పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖో-ఖో, రన్నింగ్-400 మీ.,మరియు జంప్, లాంగ్ జంప్‌లలో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమములో శ్రీ మోహన్ రావు పటేల్, డా॥దామోదర రెడ్డి, డా॥అనిల్ జాదవ్, శ్రీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి :- శ్రీసరస్వతీ శిశుమందిర్ కల్వకుర్తి ఉన్నత పాఠశాలలో విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం.





ముథోల్ :- 2026 జనవరి 3,4 వ తేదీలలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ ముథోల్ పాఠశాలలో జరిగిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి ఖేల్ కూద్ లో గెలుపొంది ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన ముథోల్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు...

If undelivered please return to : **Sri Saraswathi Vidya Peetham**, 6-3-597/A/7, *Venkataramana Colony*, Khairatabad, Hyd-04.